RNI Reg-No.APTEL/2005/19204
ESTD : 1996

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

https://netimanadesam.com/

సంపుటి :21 సంచిక 92 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి శుక్రవారం 3-4-2026 పేజీలు :8 వెల: 1-00

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత రుతువు, చైత్ర మాసం, తిథి॥బ.పాడ్యమి ఉ॥7.21, చిత్త సా ॥6.17, వర్జ్యం రా॥12.20-2.04, దుర్ముహూర్తం ఉ॥ 8.24-9.12, శుభ సమయం ఉ॥ 7.30-9.00, రాహుకాలం ఉ॥10.30-12.00, సూర్యోదయం ఉ॥ 5.59, సూర్యాస్తమయం సా॥ 6.08 గం॥

**అమరావతి బిల్లు పాస్ కావడం.. ఎంపిగా ఉండడం నా అదృష్టం**

**-ఎంపి కేశినేని చిన్ని**

2లో

# అమరావతికి ఆమోద ముద్ర

**-బిల్లును రాష్ట్రపతికి పంపనున్న కేంద్రం -రాష్ట్రపతి సంతకంతో గెజిట్ విడుదల**



**న్యూఢిల్లీ,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ):** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి చట్టబద్ధత బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ఈ అమరావతి బిల్లుకు ఉభయ సభలు ఏకగ్రీవ ఆమోదం తెలిపాయి. అనంతరం ఈ బిల్లును కేంద్రం.. రాష్ట్రపతికి పంపనుంది. ఈ బిల్లుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్మ సంతకం చేసిన తర్వాత గెజిట్ నోటిఫికేషన్ విడుదలకానుంది. దీంతో ఏపీ ఏకైక రాజధానిగా అమరావతి అమల్లోకి రానుంది. ఈ బిల్లు రాజ్యసభలో గురువారం ఆమోదం పొందడంతో.. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రాజ్యసభ చైర్మన్ సి.పి.రాధాకృష్ణన్ శుభాకాంక్షలు తెలియజేశారు. మొత్తంగా ఎపి రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. 'ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్ట సవరణ బిల్లు'కు రాజ్యసభ ఆమోదం తెలిపింది. మూజువాణి ఓటుతో ఈ బిల్లు ఆమోదం పొందగా, ఇప్పటికే లోక్‌సభలోనూ ఈ బిల్లుకు ఆమోదం లభించిన విషయం తెలిసిందే. దీంతో పార్లమెంట్ ఉభయసభల ఆమోదం పొందిన ఈ బిల్లు రాష్ట్రపతి ఆమోదానికి పంపబడనుంది. రాష్ట్రపతి సంతకం అనంతరం అమరావతి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అధికారికంగా చట్టబద్ధత పొందనుంది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపుగా భావిస్తున్నారు. ముఖ్యంగా రాజధాని విషయంలో ఉన్న అనిశ్చితి తొలగిపోవడం పట్ల ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. రాజ్యసభలో ఈ బిల్లుపై జరిగిన చర్చ అనంతరం కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ సమాధానం ఇచ్చారు. ఏపీ రాజధాని అంశంపై ఉన్న అస్పష్టత పూర్తిగా తొలగిపోయిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు శుభాభినందనలు తెలిపారు. ఇక, రాజ్యసభ విజిటర్స్ గ్యాలరీలో ఈ చర్చను వీక్షించిన ఏపీ మంత్రి నారా లోకేష్, ఇతర ఎంపీలు బిల్లు ఆమోదం పొందిన వెంటనే ఆనందాన్ని పంచుకున్నారు. 'జై అమరావతి' నినాదాలతో ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడిని కౌగిలించుకుని, బిల్లుపై ఆయన చక్కగా మాట్లాడారని అభినందించారు. మొత్తంగా, అమరావతి చట్టబద్ధత బిల్లును లోక్‌సభ, రాజ్యసభలు ఏకగ్రీవంగా ఆమోదించడం రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశను చూపనుంది. రాజ్యసభలో అమరావతి చట్టబద్ధత బిల్లుకు కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, టీఎంసీ, ఆప్, బీజేడీ, ఆర్జేడీ, బీఆర్ఎస్, జేడీ(యూ), శివసేన మద్దతు ఇచ్చాయి. రాజ్యసభలో అమరావతి చట్టబద్ధతపై జరిగిన చర్చలో 11 పార్టీలు పాల్గొన్నాయి. 17 మంది సభ్యులు చర్చలో పాల్గొన్నారు. అయితే రాజ్యసభలో సైతం ఈ బిల్లును వైసీపీ వ్యతిరేకించింది. రాజ్యసభలో అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చలో 11 పార్టీలు పాల్గొన్నాయి. అలాగే బుధవారం లోక్‌సభలో ఈ బిల్లుపై చర్చ జరిగింది. ఈ చర్చలో 11 పార్టీలు పాల్గొన్నాయి. ఇక ఇటీవల ఏపీ అసెంబ్లీలో 11 గంటల 11 నిమిషాలకు ఈ బిల్లును ప్రభుత్వం పెట్టిన సంగతి తెలిసిందే. అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ రాజ్యసభలో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందడంతో కూటమిలోని పార్టీల ఎంపీలకు మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలిపారు. ఈ బిల్లుకు మద్దతు తెలిపిన పలు పార్టీల నాయకులకు లోకేశ్ కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను స్వయంగా కలిసి మంత్రి నారా లోకేశ్‌తోపాటు కూటమి ఎంపీలు ధన్యవాదాలు తెలిపారు. రాజధాని అమరావతి బిల్లు ఉభయసభల్లో ఆమోదం పొందడంతో రాజధాని రైతులు హర్షం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఉభయ సభల్లో ఈ బిల్లు పాస్ కావడంతో రాజధాని అమరావతిలో సంబరాలు మిన్నంటాయి. మోకాళ్ళపై నిలబడి పార్లమెంటులో ఈ బిల్లుకు మద్దతిచ్చిన పార్టీలకు వారు ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం మిగతా 2లో..



**అమరావతి బిల్లు ఉభయ సభల్లో ఆమోదం పొందడం**

# చారిత్రాత్మకం!

**-అమరావతి రైతులతో సీఎం చంద్రబాబు భేటీ**
**-అన్‌స్టాపబుల్ అమరావతి అంటూ ప్రకటన**
**-జగన్ మావిగన్ వ్యాఖ్యలపై మండిపాటు**
**-శిలాఫలకం వద్ద సాష్టాంగ ప్రణామం**





**అమరావతి,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ):** అమరావతి బిల్లు పార్లమెంటు ఉభయ సభల్లో ఆమోదం పొందడం చరిత్రాత్మకమని సీఎం చంద్రబాబు అన్నారు. ఆంధ్రుల ఆకాంక్ష నెరవేరిందని చెప్పారు. అమరావతికి లభించిన ఈ గౌరవం ప్రతీ ఆంధ్రుడికీ గర్వకారణమన్నారు. అమరావతి ప్రస్థానంలో ప్రతి అడుగులో ప్రధాని మోదీ అండగా నిలిచారని తెలిపారు. రాజధాని రైతులు చేసిన త్యాగం, చూపిన పట్టుదల మరువలేనివని, ఈ విజయం వారికే అంకితమన్నారు. అమరావతే ఇక ఆంధ్రులకు ఏకైక ప్రజా రాజధాని అని చెప్పారు. అమరావతికి చట్టబద్ధత బిల్లు ఆమోదంపై ఉద్ధండరాయునిపాలెంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. సతీసమేతంగా వెళ్లిన సీఎం చంద్రబాబుకు అక్కడి రైతులు, మహిళలు ఆప్యాయంగా స్వాగతం పలికారు. ఉద్ధండరాయునిపాలెంలో శంకుస్థాపన శిలాఫలకాన్ని సీఎం పరిశీలించారు. అమరావతిలో పవిత్ర నీరు, మట్టి ప్రదేశం వద్ద చంద్రబాబు మోకరిల్లారు. అక్కడ నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అమరావతికి వచ్చింది తాత్కాలిక ఇబ్బందులేనని, ఇక అపజయం లేదని అన్నారు. రైతుల ఐకమత్యమే అమరావతిని గెలిపించింది. ప్రపంచంలోనే ఉత్తమ రాజధానిగా అమరావతిని తయారు చేస్తాం. తెలుగు జాతి గౌరవం, గుండె అమరావతి. వైకాపాకి ఇంకా జ్ఞానోదయం కలగలేదు. వైకాపా పీడ రాష్ట్రానికి విరగడ కావాల్సి ఉందన్నారు.. మావిగన్ అంటూ జగన్ కొత్త పదం తీసుకొచ్చారు. మావిగన్ అంటే ఏంటో డిక్షనరీలో చూశాను. నాకెక్కడా దాని అర్థం దొరకలేదు. అమరావతిని చంపాలనుకున్న వైకాపా.. బాగుపడే సమస్యే లేదు. వాకౌట్ చేసిన వైకాపాను.. ప్రజలు బ్లాకౌట్ చేయాలి. వైకాపా చేసినంత నీతిమాలిన రాజకీయం ఎప్పుడూ చూడలేదు. అమరావతి, విశాఖ, తిరుపతి ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం. ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని అమరావతి సాక్షిగా మాట ఇస్తున్నా. అమరావతి ఇక అన్‌స్టాపబుల్.. అజరామరం అంటూ ప్రకటించారు. అమరావతికి ఘనమైన చరిత్ర ఉంది. వైకాపా మినహా దేశంలోని అన్ని రాజకీయ పార్టీలూ బిల్లుకు మద్దతిచ్చాయి. అమరావతితో నాకు చాలా ఎమోషన్ ఉంది. కుట్రలు, విధ్వంసకర పరిస్థితులను ఎదుర్కొని రాజధాని సంపాదించుకున్నాం. జగన్ మూడు రాజధానులంటూ మూడు మిగతా 2లో..

## అమరావతికి చట్టబద్ధతకు థాంక్స్

**-ప్రధాని మోదీని కలిసి లోకేశ్ కృతజ్ఞతలు**



**న్యూఢిల్లీ,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ):** అమరావతికి చట్టబద్ధత బిల్లుకు బుధవారం లోక్‌సభ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ బిల్లుకు లోక్‌సభలో ఏకగ్రీవ ఆమోదం లభించింది. వైసీపీ మినహా మిగిలిన పార్టీలు బిల్లుకు మద్దతు తెలిపాయి. గురువారం బిల్లును రాజ్యసభలో ప్రవేశ పెట్టారు. హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో అమరావతికి చట్టబద్ధత బిల్లును లోక్‌సభ ఆమోదించిన నేపథ్యంలో మంత్రి నారా లోకేశ్ భారత ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. ఐదు కోట్ల మంది ప్రజల ఆకాంక్ష అయిన అమరావతికి మిగతా 2లో..

## అజేయమైన శక్తిగా అమరావతి ఆవిర్భావం

**-కుట్రలు, కుతంత్రాలకు ఇక చెక్ పడినట్లే**

**-అమరావతి బిల్లుపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం**



**అమరావతి,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ):** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు రాజ్యసభలోనూ ఆమోదం పొందడం పట్ల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. గత కొన్నెళ్లుగా రాజధాని ఉనికిపై సాగిన కుట్రలు, అపోహలు, న్యాయపరమైన చిక్కులన్నింటినీ అధిగమించి.. నేడు పార్లమెంట్ సాక్షిగా అమరావతి అజేయమైన శక్తిగా అవతరించిందని చెప్పారు. అమరావతి ఇక అజేయమని, అభివృద్ధి పథంలో దూసుకుపోతుంది. అమరావతి అభివృద్ధికి బలమైన తోడ్పాటు అందిస్తూ, చట్టబద్ధత బిల్లును విజయ వంతంగా ముందుకు తీసుకెళ్లిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకి ప్రత్యేక ధన్యవాదాలు'. ఈ చరిత్రాత్మక విజయాన్ని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా కూటమి పక్షాలు నిర్వహించే సంబరాల్లో జనసేన నాయకులు, కార్యకర్తలు భాగస్వామ్యం కావాలి. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల ముందు, పార్టీ కార్యాలయాల వద్ద దీపాలు వెలిగించి అమరావతి విజయోత్సవాన్ని జరుపు కోవాలి' అని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. లోక్‌సభ అనంతరం రాజ్యసభలోనూ బిల్లు నెగ్గడంతో రాజధానిగా అమరావతికిఇక ఎదురులేదని, ఇది ఐదు కోట్ల ఆంధ్రులు గర్వించ దగ్గ శుభపరిణామమని అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లా డుతూ.. ఆంధప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు లోక్ సభ అమోదం పొందటంతో రాష్ట్ర ప్రజలందరూ సంతో షంలో ఉన్నారు. వారంతా ఎంతో గర్వించే క్షణాలు. ఈ చట్టబద్ధతతో అమరావతి శాశ్వత రాజధానిగా నిలుస్తుంది. లోక్‌సభలో ఈ బిల్లుకు మద్దతు తెలియజేసిన ఇతర పార్టీలు, ఎంపీలకు ధన్యవాదాలు. అమరా వతికి చట్టబద్ధత లభించడం జీర్ణించుకోలేక విషం చిమ్ముతున్నవారికి రాబోయే రోజుల్లో ప్రజలు గొప్ప గుణపాఠం నేర్పిస్తారు. మిగతా 2లో..

## అమరావతి విజయం రైతులదే!

**-అధికారంలోకి రాగానే నాలుక మడతేసిన జగన్**
**-మూడు రాజధానులంటూ రైతులకు హింసలు**
**-మీడియా సమావేశంలో మంత్రి లోకేశ్**

2లో

## అమరావతిని సకాలంలో పూర్తి చేసి చూపాలి

**-తెలంగాణకు కేంద్రం మొండి చేయి చూపడం సరికాదు**
**-రాజ్యసభలో ఎంపి రేణుకా చౌదరి వ్యాఖ్య**

6లో

## కలల రాజధానికి చట్టబద్ధత

**- తిరుపతి జిల్లాలో అంబరాన్ని అంటిన సంబరాలు**
**- కలెక్టరేట్‌లో జ్యోతి ప్రజ్వలన చేసి హర్షం వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్**
**- ప్రభుత్వ కార్యాలయాలలో రంగవల్లులు, విద్యుత్ దీపాలంకరణతో వేడుకలు**




**తిరుపతి సిటీ, ఏప్రిల్ 2(నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ ప్రజల కలల రాజధాని అమరావతిని శాశ్వత రాజధానిగా గుర్తిస్తూ చట్టం చేసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పై జిల్లా వ్యాప్తంగా వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ గురువారం రాత్రి కలెక్టరేట్ లో అమరావతి కి చట్ట బద్ధత కల్పించిన నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్ లో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, డి ఆర్ ఓ జి. నరసింహులు, శ్రీకాళహస్తి ఆర్ డి ఓ భాను ప్రకాష్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులతో కలసి మిగతా 2లో..



## పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ పూర్తి

**-ఇరిగేషన్ శాఖ ఇంజనీర్లకు అభినందనలు**
**-ఎక్స్ వేదికగా ప్రకటించిన సీఎం చంద్రబాబు**

**అమరావతి,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ):** పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తి కావడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. పోలవరం నిర్మాణంలో మరో కీలక ఘట్టం పూర్తయ్యిందని అన్నారు. డయాఫ్రం వాల్ నిర్మాణాన్ని తక్కువ సమయంలోనే పూర్తి చేయడాన్ని ప్రశంసించారు. ఈ మేరకు మిగతా 2లో..

## పోలవరం పనులు పరిశీలించిన మంత్రి నిమ్మల

**ప్రాజెక్ట్ డయాఫ్రం వాల్ పూర్తి అయినట్లు ప్రకటన**

**ఇంజినీర్లు, తదితరుల కృషికి మంత్రి అభినందనలు**



**ఏలూరు,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ):** ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తయిందని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. 2027 కల్లా పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసే లక్ష్యంతో డయాఫ్రం వాల్ పూర్తయి మెయిన్ డ్యామ్ పనులు జరుగు తున్నాయన్నారు. గురువారం పోలవరం ప్రాజెక్టు వద్ద పూర్తయిన డయాఫ్రం వాల్ పనులను మంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. 1,372 మీటర్ల పొడవైన డయాఫ్రం వాల్ నిర్మాణాన్ని 440 రోజుల్లో పూర్తి చేశామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో 18 నెలలు శ్రమించి నిర్మించిన డయాఫ్రం వాల్‌ను గత జగన్ ప్రభుత్వం విధ్వంసం చేసిందని గుర్తు చేశారు. జగన్ విధ్వంసానికి కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణానికి అదనంగా మరో రూ.1000 కోట్లు ఖర్చు అయిందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. 2025 జనవరి మిగతా 2లో..

విశ్వాసం, ఋజువర్తనం, శ్రద్ధాభక్తులు ఉన్నంతవరకు విజయం కలగడం ఖాయం. నేలపై పాకే చీమ కన్నా నేను గొప్ప వాడినని అనుకుంటే నేను అజ్ఞానినే.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# జగన్... చపలచిత్త రాజకీయాలు!

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రాజకీయాలు సూస్తుంటే ..ఇంతటి అపరిపక్వ రాజకీయ నేతను చూసి ఉండమేమో అనిపిస్తుంది. చంద్రబాబు మీద వ్యతిరేకత ఉన్నవారు సైతం రాజధాని విషయంలో వ్యతిరేకించడం లేదు. ఏ విషయంలోనూ స్పష్టత లేని జగన్ ఐదేళ్ల పాటు ప్రజలు ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేశారు. అతి తక్కువ సమయంలో సిఎంగా ప్రజలు ఆదరిస్తే, దానిని అద్భుత అవకాశంగా తీసుకుని, దార్శనికతను ప్రదర్శించాల్సిన జగన్, తన ఫ్యాక్షన్ రాజకీయతను జోడించి అభాసుపాలయ్యారు. అధికారంలో ఉండగా మూడు రాజధానులు అంటూ, రాజధాని రైతులను రాచిరంపాన పెట్టారు. అమరావతిని వేశ్యల రాజధాని అన్నారు. అదో కమ్మ సామ్రాజ్యం అన్నారు. మూడు రాజధానులంటూ ఊదరగొట్టి, అసలు రాజధాని లేకుండా ఐదేళ్లు కాలం గడిపారు. ఇప్పుడేమో మావిగన్ అంటూ జగన్ కొత్త పల్లవి అందుకున్నారు. ఇవన్నీ చూస్తుంటే జగన్‌లో ఓ అపరిచితుడు ఉన్నాడా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. రాజధాని అమరావతి రైతులకు న్యాయం జరగడం లేదంటున్న వ్యక్తి, తన సొంతింట్లో సొంత చెల్లెలికి మాత్రం న్యాయం చేయడం లేదు. హక్కుగా ఉన్న ఆస్తిని పంచడం లేదు. తల్లి చెప్పినా వినడం లేదు. అంతెందుకు రాజధాని విషయంలో ఏం మాట్లాడుతున్నారో ఆయనకైనా అర్థం అవుతందా అన్నది అర్థం కావడం లేదు. మూడు రాజధానులు అన్నారు. అసలు రాజధాని అవసరం లేదంటున్నాడు. మావిగన్ అంటున్నాడు. అంటే చిత్తశుద్ధి, స్థిర సంకల్పం లేని రాజకీయ నేతగా జగన్‌ను చూడాలి. ఇలాంటి వారు అధికారంలో ఉండగా ఎంతగా తెగించారో చూశాం. అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానుల పాట పాడిన వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్.. ఇప్పుడు 'ప్లాన్–బి' పేరుతో కొత్త పల్లవి అందుకున్నారు. విశాఖలో ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ నచ్చకపోతే.. ప్లాన్–బీ కింద మచిలీపట్నం (మా) –విజయవాడ (వి)–గుంటూరు (గన్) నగరాలను రాజధానిగా అభివృద్ధి చేయొచ్చని సెలవిచ్చారు. దీనికి ఎంచక్కా 'మావిగన్' అని పేరు పెట్టొచ్చన్నారు. 'గన్'లో తన పేరు ఉన్నందున, అది నచ్చకపోతే ఇంకోపేరు పెట్టుకోవచ్చని కూడా సలహా ఇచ్చారు. మచిలీపట్నం–విజయవాడ–గుంటూరు మధ్య 110 కిలోమీటర్ల హైవే ప్రాంతం పరిధిలో 110 ఎకరాల్లో రాజధాని నగరాన్ని ఏర్పాటు చేయొచ్చని జగన్ పేర్కొన్నారు. 'మావిగన్'పై తన అభిప్రాయాన్ని విన్నాక.. రాష్ట్ర ప్రజలు తనతో ఏకీభవిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. అమరావతి మాత్రం ఆచరణ సాధ్యం కాదని తేల్చేశారు. భవిష్యత్తులో తమ ప్రభుత్వం వచ్చాక అసెంబ్లీలో చట్ట సవరణ ద్వారా రాజధానిని మార్చేస్తామని కూడా ప్రకటించారు. గతంలో తుగ్లక్ కూడా ఇలాగే చేశారు. ఇష్టం వచ్చినట్లుగా రాజధానిని మార్చేశారు. ఇప్పుడు జగన్ చేస్తున్న లేదా చెబుతున్నది అలాగే ఉంది. అంతెందుకు అసలు రాష్ట్రాలకు రాజధాని అవసరం లేదని సెలవిచ్చారు. గతంలో ఆయనగారు తాను అంటే సిఎం ఎక్కడ ఉంటే అదే రాజధాని అన్నారు. దీనిపై మాజీమంత్రి సోమిరెడ్డి సెటైర్లు వేశారు. లాట్రిన్‌లో ఉంటే అదే రాజధాని అవుతుందనుకోవాలా అని అన్నారు. రాజ్యాంగంలో దేశ రాజధానిపై నిర్వచనం ఉందే తప్ప.. రాష్ట్రాల రాజధాని ప్రస్తావనే ఎక్కడా లేదని జగన్ చెప్పడం ఆయన అవివేకానికి పరాకాష్టగా చెప్పుకోవాలి. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటులో చట్ట సవరణ చేసినా నిలువదంటున్నారు. భవిష్యత్‌లో ప్రజాభీష్టం మేరకు ఏర్పడే రాష్ట్ర ప్రభుత్వం.. రాజధానిని అమరావతి నుంచి మారుస్తూ చట్టసవరణ చేయవచ్చని కూడా సెలవిచ్చారు. అమరావతికి తాను ఏనాడూ వ్యతిరేకం కాదని, అందుకే శాసన రాజధానిగా ఏర్పాటు చేశానని తెలిపారు. అమరావతికి ఏ ఒక్కరూ వ్యతిరేకం కాదని, రాజధాని పేరిట చేస్తున్న అవినీతికే వ్యతిరేకమని చెప్పారు. అమరావతిలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ కంటే తానే ఎక్కువ కాలం కాపురం చేశానని జగన్ చెప్పుకున్నారు. తనకు అమరావతిపై అభిమానం ఉందనేందుకు చంద్రబాబు కంటే ముందుగానే తాడేపల్లిలో సొంత ఇల్లు కట్టుకున్నానని.. ప్రస్తుతం అదే భూమిపై ఉండడమే సాక్ష్యమన్నారు. ఇలా అర్థంపర్థం లేని వ్యాఖ్యలు, వాదనలు జగన్ రాజకీయ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయి. అతనిలోని నిరంకుశ విధానాలు బటయకు వస్తున్నాయి. అధికారంలో ఉంటే ఎంతటి విధ్వంసానికి అయినా తెగిస్తారని ప్రజావేదిక కూల్చివేతతో చూపారు. మద్యపాన నిషేధం పేరుతో మద్యంపై దందా చేశారు. ఒక్కటేమిటి సకల వ్యవస్థలను భ్రష్టు పట్టించి, బటన్ నొక్కుడుతో రాష్ట్రాన్ని అధోగతి పాలుచేశారు. అప్పులు చేసి ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేశారు. విశాఖ భీమిలిలో ప్యాలెస్‌లు కట్టుకుని తన రాజరిక పోకడలను చాటారు. అందుకే ఇప్పుడు జగన్ తననకున్న కాస్తా ఇమేజ్‌ను బజారున పడేసుకున్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును వ్యతిరేకించడం ద్వారా వైసీపీతో పాటు జగన్ జాతీయ రాజకీయాల్లో భ్రష్ట చరిత్రను లిఖించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధానికి సంబంధించిన బిల్లును.. వైసీపీ తప్ప అన్ని పార్టీలూ సంపూర్ణంగా సమర్థించాయి. బిల్లును వ్యతిరేకించొద్దు.. మద్దతు ఇవ్వొద్దన్నది తొలుత వైసీపీ తీసుకున్న నిర్ణయం. అయితే కాంగ్రెస్ తెలంగాణ ఎంపీలు సైతం అమరావతికి మద్దతిస్తూ మాట్లాడడంతో వైసీపీ నాయకత్వానికి దిక్కుతోచలేదు. చివరకు వ్యతిరేకిస్తూ ఆ పార్టీ ఎంపీలు వాకౌట్ చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబును విమర్శిస్తూ వైసీపీ లోక్‌సభాపక్ష నేత మిథున్‌రెడ్డి చేసిన ప్రసంగాన్ని గానీ.. ఆ పార్టీ ఎంపీల వాకౌట్‌ను గానీ సభలో ఎవరూ పట్టించుకోలేదు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ముగుస్తున్న వేళ, అకస్మాత్తుగా బిల్లును తెరపైకి తేవడం.. దానికి ముందే అసెంబ్లీలో తీర్మానం ఆమోదించి పంపాలని స్వయంగా ప్రధాని కార్యాలయం రాష్ట్రప్రభుత్వానికి సూచించడం.. ఆగమేఘాలపై కూటమి ప్రభుత్వం అత్యవసరంగా అసెంబ్లీని సమావేశపరచి తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించడం.. శాసనమండలిలో పెట్టనవసరం లేదని తేల్చడం.. ఆ వెంటనే కేంద్రం బిల్లును తీసుకు రావడం.. శరవేగంతో జరిగిన ఈ పరిణామాలతో జగన్ ఉక్కిరిబిక్కిరి అయ్యారని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. ఓవైపు మతపరమైన, కుటుంబపరమైన వివాదాలు జగన్‌ని చుట్టుముడుతున్న వేళ, ఇప్పుడు అమరావతితో రాజకీయంగా సమాధి తవ్వుకున్నట్లుగానే భావించాలి. వర్తమాన రాజకీయాలలో జగన్ తనవికృత రాజకీయ మేథను ప్రదర్శించి మరొకరు సాటిరారని ప్రచారం చేసుకున్నారు. ఇలాంటి రాజకీయ నేతల వల్ల ప్రజలకు కానీ, రాష్ట్రానికి కానీ మేలు జరగదు. ఫక్తు ఫ్యూడల్ వ్యవస్థకు పునాదిగా జగన్ రాజకీయ ఆలోచనలు అద్దం పడుతున్నాయి.

# అమరావతి బిల్లు పాస్ కావడం.. ఎంపిగా ఉండడం నా అదృష్టం: ఎంపి కేశినేని చిన్ని

అమరావతి,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ): రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లు పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందడంతో ఐదు కోట్ల ఆంధ్రులలో పట్టలేని ఆనందాన్ని నింపుతుందని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని తెలిపారు. పార్లమెంట్‌లో రాజధాని అమరావతి బిల్లు చట్టబద్ధత పొందడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ బిల్లు ఆమోదానికి కృషి చేసిన ప్రధాని మోదీకి ఈ సందర్భంగా ఆయన తెలుగు ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలిపారు. గురువారం అమరావతిలో ఎంపీ కేశినేని చిన్న విలేకర్లతో మాట్లాడుతూ.. అమరావతి బిల్లు పార్లమెంటులో ఆమోదానికి వచ్చే సమయంలో ఆ ప్రాంతంలోని విజయవాడ ఎంపీగా తాను ఉండడం సంతోషంగా ఉందన్నారు. ఈ బిల్లు చట్టబద్ధతకు కృషి



చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, యువ నేత, మంత్రి నారా లోకేశ్‌కు కేశినేని చిన్ని ధన్యవాదాలు తెలిపారు. రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించడం పట్ల ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. గురువారం అమరావతిలో ఆయన మాట్లాడుతూ.. రాజధానిపై ఉన్న గందరగోళానికి తెర దించుతూ అసెంబ్లీ చేసిన తీర్మానానికి కేంద్రం చట్టబద్ధత కల్పించడం సంతోషంగా ఉందన్నారు. రాజధాని అమరావతిలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకొందామని అనుకున్నామన్నారు. ఇలాంటి తరుణంలో మూడు రాజధానులు పేరుతో వైసీపీ గందరగోళానికి తెర తీసిందని రామకృష్ణ గుర్తు చేసుకున్నారు. రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించడంతో ఇకపై రాష్ట్రంలో ఎటువంటి గందరగోళం ఉండదన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి తాము సైతం పూర్తిగా సహకరిస్తామని ఈ సందర్భంగా ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామకృష్ణ స్పష్టం చేశారు.

# జగన్‌కు రాజకీయ పరిజ్ఞానం లేదు: కన్నా

**అమరావతి, ఏప్రిల్ 2:** మాజీ సీఎం జగన్‌కు రాజకీయ పరిజ్ఞానం లేదని, తన మాటలతో రాష్ట్ర ప్రజలను మోసగించారని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. గురువారం గుంటూరులోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర విభజన తరవాత అన్ని పార్టీల అనుమతితోనే రాజధానిగా అమరావతిని ప్రకటించారని, అప్పుడు జగన్ అసెంబ్లీ సాక్షిగా అంగీకారం చెప్పారన్నారు. 2019 ఎన్నికల్లో అమరావతే రాజధానిగా ఉంటుందని నమ్మించి.. అధికారంలోకి రాగానే మూడు రాజధానులంటూ జగన్ ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. పార్లమెంటులో అమరావతిపై చట్టం చేస్తున్న సమయంలోనూ కనీస అవగాహన లేకుండా 'మావిగన్' అంటూ మాట్లాడుతున్న జగన్‌ను చూస్తుంటే సిగ్గుగా ఉందన్న కన్నా లక్ష్మీనారాయణ.. బిల్లుపై చర్చ సమయంలో పార్లమెంట్ నుంచి వైకాపా ఎంపీలు వాకౌట్ చేయడం దారుణమన్నారు. జగన్ అమరావతి రైతులకు, రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# అమరావతి విజయం రైతులదే!

## అధికారంలోకి రాగానే నాలుక మడతేసిన జగన్ మూడు రాజధానులంటూ రైతులకు హింసలు మీడియా సమావేశంలో మంత్రి లోకేశ్

**న్యూఢిల్లీ,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ):** ఎన్నికలకు ముందు ఏకైక రాజధాని అమరావతి అని చెప్పిన జగన్.. గెలిచిన ఆర్నెళ్లలో మూడు రాజధానుల పేరిట డ్రామా చేశారని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. ప్రపంచంలో మూడు రాజధానుల విధానం ఎక్కడా విజయవంతం కాలేదని చెప్పారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలుగు ప్రజలంతా కలిసి హైదరాబాద్‌ను నిర్మించుకున్నారని, అయితే, రాజధాని లేకుండా ఏపీని విభజించారని అన్నారు. రాష్ట్రానికి మధ్యలో రాజధాని ఉండాలని అమరావతిని ఎంపిక చేశామని, 2014లో వైకాపా సహా అన్ని పార్టీలు దీనికి అంగీకరించాయన్నారు. రాజధాని కోసం 58 రోజుల్లో 35 వేల ఎకరాల భూమిని రైతులు ఇచ్చారు. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత రాజధానిగా అమరావతిని కొనసాగించాలంటూ శాంతియుతంగా నిరసన చేస్తున్న రైతులను, మహిళలను దారుణంగా హింసించారు. రైతులు 1,600 రోజులకుపైగా పోరాడారు. ఏకైక రాజధానిగా అమరావతి ఉంటుందని గత ఎన్నికల్లో మళ్లీ చెప్పాం. 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో ప్రజలు విజయం కట్టబెట్టారు. రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో విశాఖ ఎంపీ గెలిచారు. జగన్ చెప్పిన ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌లోనే మా ఎంపీ గెలిచారు. ప్రజలంతా అమరావతే ఏకైక రాజధాని అని మద్దతు పలికారు. అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం పొందేందుకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు. బిల్లుకు ఒక్క పార్టీ మినహా అన్ని పార్టీలు మద్దతు తెలిపాయి. ఈ విజయం అమరావతి రైతులదే అని లోకేశ్ అన్నారు.

# జగన్‌కు.. రైతుల త్యాగాలు ఏం అర్థమవుతాయి: అనిత

**అనకాపల్లి,ఏప్రిల్2:** "అమరావతి శాశ్వత రాజధానిగా మారుతున్న తరుణంలో జగన్ అక్కసు బయటపెడుతున్నారు. సొంత తల్లిని పార్టీ నుంచి సస్పెండ్ చేసి, ఆస్తి విషయంలో చెల్లికి అన్యాయం చేసి కోర్టుకు ఎక్కిన జగన్‌ను అమరావతి రైతుల త్యాగాలు, ఉద్యమాలు ఏం కదిలిస్తాయి" అని హోం మంత్రి వంగలపూడి అనిత విమర్శించారు. అనకాపల్లి కలెక్టరేట్‌లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. జగన్ పిచ్చి పరాకాష్ఠకు చేరిందని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలాగా.. లేనప్పుడు మరోలా మాట్లాడటం.. ఆయనకే చెల్లుతుందన్నారు. నాడు మూడు రాజధానులు అంటూ నాటకాలు ఆడారని.. నేడు 'మావిగన్' పేరుతో రాజధాని పెట్టాలని మాట్లాడటం చూసి రాష్ట్ర ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. అమరావతిపై పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లును కనీస జ్ఞానం లేకుండా తప్పుపడుతూ తాను అధికారంలోకి వస్తే ఏదో చేస్తామని చెప్పడం సిగ్గుచేటని మండిపడ్డారు. అమరావతి తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు 11 మందితో అసెంబ్లీకి వచ్చి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. అప్పుడు రాజధానిగా 'మావిగన్' అని పెడతారో, లేదా 'మావిగొడ్డలి' అని పెడతారో ఎందుకు చెప్పలేదన్నారు.

## మొదటి పేజీ తరువాయి

# అమరావతి బిల్లు ఉభయ సభల్లో ఆమోదం పొందడం చారిత్రాత్మకం!



ముక్కలాట ఆడారు. రాజధానికి 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారు. ఇది రాజధాని కాదు.. ప్రజల ఆత్మగౌరవానికి చిహ్నం. కుట్రలు, విధ్వంసకర పరిస్థితుల్లో రాజధాని సంపాదించుకున్నాం. అమరావతికి గెలుపే తెలుసు.. ఓటమి అంటే ఏమిటో తెలియదు. మీ ఐకమత్యంతో రాజధానిని గెలుచుకున్నాం. అమరావతి చరిత్రలో మీ ప్రతాపం, పట్టుదల చూపించారు. చరిత్ర ఉన్నంతవరకు అమరావతి ఉంటుందని చంద్రబాబు అన్నారు.

# అమరావతికి ఆమోదముద్ర

పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు రాజధాని ప్రాంత రైతులు పాలాభిషేకం చేశారు. దాంతో ఆ ప్రాంతంలోని ప్రజల్లో ఆనందం వెల్లివిరిసింది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో తీర్మానం చేసిన రాజధాని అమరావతి బిల్లును ఇటీవల కేంద్రానికి పంపారు. ఈ బిల్లు బుధవారం లోక్‌సభలో ఆమోదం పొందడంతో.. రాజ్యసభకు పంపారు. ఈ బిల్లుపై గురువారం రాజ్యసభలో చర్చ జరిగింది. అనంతరం ఈ బిల్లు ఆమోదం పొందింది. ఉభయ సభలు ఆమోదం పొందడంతో.. ఈ బిల్లును రాష్ట్రపతి ద్రౌపది ముర్మ సంతకం కోసం రాష్ట్రపతి భవన్‌కు పంపనున్నారు.

# పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ పూర్తి

ఇరిగేషన్ శాఖ, ఇంజనీర్లకు అభినందనలు తెలిపారు. 2027 పుష్కరాలకు ముందే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం ఇస్తామని సీఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 'ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలన్న ప్రభుత్వ సంకల్పంలో నేడు మరో కీలక ఘట్టం పూర్తయ్యింది. ప్రాజెక్టు నిర్మాణంలో అత్యంత కీలకమైన 1,372 మీటర్ల పొడవైన 'డయాఫ్రం వాల్' నిర్మాణాన్ని తక్కువ సమయంలో పూర్తి చేసిన ఇరిగేషన్ శాఖ అధికారులకు, ఇంజనీర్లకు అభినందనలు. దీనికి సహకరించిన కేంద్ర సంస్థలు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ ప్రతినిధులకు ధన్యవాదాలు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా డి–వాల్ దెబ్బతినడంతో అదనంగా రూ.1000 కోట్లు వెచ్చించి నిర్మించాం. డయాఫ్రం వాల్ పూర్తి కావటంతో ప్రధాన కట్టడమైన ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ పనులు వేగవంతం అవుతాయి. ఇప్పటికే ప్రకటించినట్లు అన్ని పనులు పూర్తి చేసి 2027 పుష్కరాలకు ముందే పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితమిస్తాం' అంటూ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

# అమరావతికి చట్టబద్ధతకు థాంక్స్

చట్టబద్ధత కల్పించే బిల్లుకు పూర్తి మెజార్టీతో లోక్‌సభలో ఆమోదం లభించడానికి కృషి చేసిన ప్రధాని మోదీకి లోకేశ్ కృతజ్ఞతలు తెలియజేశారు. గురువారం ఉదయం పార్లమెంట్ హాలులో మంత్రి లోకేశ్ ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. దేశంలో ఉన్న అన్ని పార్టీలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైపు నిలిపి అమరావతికి చట్టబద్ధత కల్పించిన ప్రధాని మోదీకి ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందిన వెంటనే మంత్రి నారా లోకేశ్ ఆగమేఘాలపై ఢిల్లీ వెళ్లారు. కూటమి పార్టీ ఎంపీలను అభినందించారు. ఉదయం ప్రధానమంత్రి మోదీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి చూపిన నిబద్ధతను మంత్రి లోకేశ్ ప్రశంసించారు.

# అజేయమైన శక్తిగా అమరావతి ఆవిర్భావం

ఇక ఎదురులేదని, ఇది ఐదు కోట్ల ఆంధ్రులు గర్వించ దగ్గ శుభపరిణామమని అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు లోక్ సభ అమోదం పొందటంతో రాష్ట్ర ప్రజలందరూ సంతోషంలో ఉన్నారు. వారంతా ఎంతో గర్వించే క్షణాలు. ఈ చట్టబద్ధతతో అమరావతి శాశ్వత రాజధానిగా నిలుస్తుంది. లోక్‌సభలో ఈ బిల్లుకు మద్దతు తెలియజేసిన ఇతర పార్టీలు, ఎంపీలకు ధన్యవాదాలు. అమరావతికి చట్టబద్ధత లభించడం జీర్ణించుకోలేక విషం చిమ్ముతున్నవారికి రాబోయే రోజుల్లో ప్రజలు గొప్ప గుణపాఠం నేర్పిస్తారు.

# పోలవరం పనులు పరిశీలించిన మంత్రి నిమ్మల

18వ తేదీన ఈ డయాఫ్రం వాల్ నిర్మాణ పనులు ప్రారంభించి.. ఈ రోజు పూర్తి చేశామని వివరించారు. 2020 ఆగస్టులో వచ్చిన వరదలకు డయాఫ్రం వాల్ దెబ్బతింటే, 2021 జూన్, అదే ఏడాది డిసెంబర్, 2022 జూన్‌లో దీనిని పూర్తి చేస్తామని వైఎస్ జగన్ అసెంబ్లీలో చేసిన ప్రకటనలను ఈ సందర్భంగా మంత్రి ప్రస్తావించారు. ప్రాజెక్టుకు డయాఫ్రం వాల్ ఉందో లేదో తెలియని స్థితిలో నాటి ముఖ్యమంత్రి జగన్ ఉన్నారని వ్యంగ్యంగా అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విధ్వంసమైన పోలవరం ప్రాజెక్టు పనులను సీఎం చంద్రబాబు గాడిలో పెట్టారని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. ప్రాజెక్టు డయాఫ్రం వాల్ పూర్తి కావడంతో.. ఈ నిర్మాణంలో భాగమైన ఇంజనీర్లు, సిబ్బందిని మంత్రి నిమ్మల రామానాయుడు సన్మానించి.. వారికి స్వీట్లు తినిపించారు.

# కలల రాజధానికి చట్టబద్ధత

జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో అసెంబ్లీలో చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకొని, అమరావతిని శాశ్వత రాజధానిగా తీర్మానం చేసి కేంద్రానికి పంపడం జరిగిందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం అమరావతిని ఆంధ్రప్రదేశ్ కు శాశ్వత రాజధానిగా ప్రకటిస్తూ లోక్ సభ, రాజ్య సభల్లో బిల్లు ఆమోదం పొందడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు తిరుపతి కలెక్టరేట్, పట్టణం లోని డి ఆర్ డి ఏ ఎస్ హెచ్ జి మహిళలతో రంగులు తీర్చిదిద్ది దీపాలు వెలిగించడంతో పాటు ఐ సి డి ఎస్, ఆర్ అండ్ బి, మెప్మా, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ దీపాలంకరణ చేశారు. ఈ సందర్భంగా తిరుపతి లోని మంగళం (ట్రెండ్స్) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కేక్ కట్ చేయించి, సాంస్కృతిక కార్యక్రమాలు, అమరావతి ప్రాముఖ్యత పై విద్యార్థుల ప్రసంగాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్, ల్యాండ్ సర్వే ఏ డి అరుణ్ కుమార్, కలెక్టరేట్ సెక్షన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


## దక్షిణ రైల్వే

(ఎలక్ట్రికల్ (జనరల్), కన్‌స్ట్రక్షన్, ఎగ్మోర్, చెన్నై)

**టెండర్ నోటీసు నం: E-HQ-CN-MS-EOT21-2025-26, తేదీ: 31.03.2026**

భారత రాష్ట్రపతి తరపున, డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ / జనరల్ / కన్‌స్ట్రక్షన్ / దక్షిణ రైల్వే / ఎగ్మోర్, చెన్నై - 600008 వారు క్రింది పనికి ఈ-టెండర్‌ను ఆహ్వానిస్తున్నారు.

**పని పేరు:** గంగైకొండన్ (GDN) రైల్వే స్టేషన్‌లో ప్రతిపాదిత కొత్త గూడ్స్ ప్లాట్‌ఫారం మరియు యార్డ్ మార్పుల కోసం ఎలక్ట్రికల్ ఏర్పాట్ల కల్పన పనులు (వర్క్స్ కాంట్రాక్ట్).

| టెండర్ నోటీసు నం మరియు తేదీ: | | E-HQ-CN-MS-EOT21-2025-26, తేదీ: 31.03.2026. |
|---|---|---|
| 1 | పని పూర్తి గడువు | 4 నెలలు |
| 2 | పని అంచనా వ్యయం | ₹ 1,45,62,467.67/- |
| 3 | టెండర్ ఫారం ఖర్చు | లేదు |
| 4 | అర్నెస్ట్ మనీ డిపాజిట్ (EMD) | ₹ 2,91,300/- |
| 5 | టెండర్ ముగింపు తేదీ & సమయం | 24 / 04 / 2026 & 11:00 |
| 6 | టెండర్ ఓపెనింగ్ తేదీ & సమయం | 24 / 04 / 2026 & 11:30 |

పూర్తి వివరాలు www.ireps.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, కన్‌స్ట్రక్షన్, దక్షిణ రైల్వే, ఎగ్మోర్, చెన్నై.

## దక్షిణ రైల్వే

**ఈ-వేలం ప్రకటన / వాహన పార్కింగ్ / NFR / 'ఈ'-వేలం / 2026**

డివిజనల్ రైల్వే మేనేజర్ (కామర్షియల్), దక్షిణ రైల్వే, చెన్నై డివిజన్, చెన్నై-600003 వారు వాహన పార్కింగ్ కాంట్రాక్టులు / ప్రచార కాంట్రాక్టులు / కేటరింగ్ స్టాల్ కాంట్రాక్టులు / ప్రయాణికుల సౌకర్యాల కాంట్రాక్టులను కేటాయించడానికి ఈ-వేలం ద్వారా బిడ్లు ఆహ్వానిస్తున్నారు. ఈ-వేలం షెడ్యూల్ క్రింద ఇవ్వబడింది:

| క్రమ సంఖ్య | క్యాటలాగ్ నం | స్థలం / సైట్ | తేదీ | సమయం |
|---|---|---|---|---|
| 1. | MAS-PARKING-367 | గిండీ (రేస్ కోర్స్ వైపు), టిండివనం (FOB ఈస్ట్ సైడ్ - కార్ పార్కింగ్) | 08.04.2026 | 15.00 గంటలు |
| 2. | MAS-PARKING-368 | తాంబరం సానిటోరియం (మిక్స్‌డ్ పార్కింగ్), వ్యాసర్పాడి జీవా నార్త్ (మిక్స్‌డ్ పార్కింగ్), కట్టంగులత్తూర్, పుజుతివాక్కం | 16.04.2026 | 15.00 గంటలు |
| 3. | NFR-MAS-MAssets | ట్రైన్ నం.12243/44 పై ప్రకటనలు (విండో కింద బయట భాగం), ఇంటీరియర్ & ఎక్స్‌టీరియర్ - 9 కార్ EMUలు (వెలాచేరి) | 16.04.2026 | 15.30 గంటలు |
| 4. | NFR-PMBJK-MAS | PMBJK - సుల్లురుపేట, కాంచీపురం | 16.04.2026 | 15.30 గంటలు |
| 5. | NFR-MAS-News | వార్తాపత్రిక పంపిణీ - ట్రైన్ నం.22625/626 | 16.04.2026 | 15.30 గంటలు |
| 6. | NFR-MSS-MAS | మొబైల్ స్టోర్ - తాంబరం, తారామణి & వెరైటీ షాప్ - మింజూర్, అవడి | 17.04.2026 | 15.30 గంటలు |
| 7. | NFR-MAS-OOH Ads | అవుట్-ఆఫ్-హోమ్ ప్రకటనలు - గుడువాంచేరి, కోడంబాక్కం నుండి తాంబరం సానిటోరియం సెక్షన్ | 17.04.2026 | 15.30 గంటలు |
| 8. | NFR-CGL-OSN-26 | స్టేషన్ లో (నాన్-డిజిటల్) ప్రకటనలు - చెంగళపట్టు | 20.04.2026 | 15.30 గంటలు |
| 9. | NFR-GPD-Sports | అవుట్‌డోర్ క్రీడలు - గుమ్మిడిపూండి | 20.04.2026 | 15.30 గంటలు |
| 10. | MAS-PBCO-26-05 | ప్రీమియం స్టోర్లు - చెంగళపట్టు | 16.04.2026 | 15.00 గంటలు |
| 11. | MAS-Digilock-06 | డిజిటల్ లాకర్ - చెంగళపట్టు | 09.04.2026 | 15.00 గంటలు |

మరిన్ని వివరాల కోసం వెబ్‌సైట్: www.ireps.gov.in

## ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (మునుపటి పేరు: శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)

రిజిష్టర్డ్ ఆఫీస్ : శ్రీనివాస టవర్, 1వ అంతస్తు, డోరు నెం.5, పాత నెం.11, 2వ లేను, సెనటోఫ రోడ్డు, అల్వారేపేట, తేనంపేట చెన్నై-600018.
ప్రధాన కార్యాలయము: లెవెల్-3, వాకర్డ్ టవర్స్, ఈస్టింగ్ సి-2, జి బ్లాక్, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (ఈస్ట్), ముంబాయి-400 051, వెబ్‌సైట్: www.truhomefinance.in

### భౌతిక స్వాధీనం నోటీసు

ఈ , క్రింద సంతకం చేసిన వ్యక్తి ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) యొక్క అధీకృత అధికారిగా సెక్యూరిటైజేషన్ మరియు పునర్నిర్మాణం ఆఫ్ ఫైనాన్షియల్ ఆస్తులు మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 (చెప్పబడిన చట్టం) నిబంధనల ప్రకారం మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నియమాలు, 2002 (చెప్పబడిన నియమాలు) యొక్క నిబంధన 3 తో చదవబడిన చట్టంలోని సెక్షన్ 13(12) కింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించి రుణగ్రహీతలకు డిమాండ్ నోటీసులు జారీ చేశారు, వీటి వివరాలు క్రింద ఇవ్వబడిన పట్టికలో ఇవ్వబడినాయి డిమాండ్ నోటీసులలో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరటమైనది

రుణగ్రహీతలు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, కింద సంతకం చేసిన అధీకృత అధికారి ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) చట్టంలోని సెక్షన్ 13(4) కింద అతనికి ఇవ్వబడిన అధికారాలను ఉపయోగించి క్రింద వివరించిన ఆస్తిని 31/03/2026 వ తేదీన భౌతికంగా స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతలకు మరియు ప్రజలకు నోటీసు ఇవ్వబడింది. ముఖ్యంగా రుణగ్రహీతను మరియు సాధారణం ప్రజలను ఈ ఆస్తితో వ్యవహరించవద్దని ఇందుమూలంగా హెచ్చరిస్తున్నాము మరియు ఆస్తితో ఏదైనా లావాదేవీ ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) యొక్క ఛార్జీకి అనగా క్రింద పేర్కొన్న మొత్తానికి వడ్డీతో సహా లోబడి ఉంటుంది,
సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందేందుకు అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలపై రుణగ్రహీత దృష్టి కి తీసుకు రావటమైనది

**రుణగ్రహీత పేరు మరియు చిరునామా**

శ్రీమతి షబానా సయ్యద్,C/O శ్రీ షగీర్ కఫార్
శ్రీ షగీర్ కఫార్, S/O శ్రీ కఫార్ మస్తాన్
చిరునామా: డోర్ నెం. 42/16, మాలవ్యనగర్, ఎస్‌బిఐ టౌన్ బ్రాంచ్ ఎదురు, గూడూరు, నెల్లూరు, ఆంధ్రప్రదేశ్, భారతదేశం – 524101

**డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం**

డిమాండ్ నోటీస్ తేదీ – 12-11-2025
లోన్ అకౌంట్ నంబర్ SHLHNELR0000599కు సంబంధించిన డిమాండ్ నోటీస్ మొత్తం రూ. 21,72,418/- (ఇరవై ఒక లక్షల డెబ్బై రెండు వేల నాలుగు వందల పద్దెనిమిది రూపాయలు మాత్రమే) 30-11-2025 నాటికి ఉంది.

**తనఖా ఆస్తి వివరాలు**

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు రిజిస్ట్రేషన్ జిల్లా, నెల్లూరు స్టోన్ హౌస్‌పేట ఉప-రిజిస్ట్రార్ కార్యాలయ పరిధి, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్టోన్ హౌస్‌పేట, నవాబ్‌పేట, మెయిన్ రోడ్, నారుకూరు రోడ్ ప్రాంతంలో ఉన్న పాత డోర్ నంబర్లు 4/90 & 4/240, కొత్త డోర్ నంబర్ 4/295 గల 43 1/3 అంకణాల స్థలానికి సంబంధించిన ఆస్తి సరిహద్దులు క్రింది విధంగా ఉన్నాయి: తూర్పు: కామిశెట్టి సుబ్బారావు గారి ఇల్లు , దక్షిణం: గ్రామ సచివాలయం ఈ ఆస్తి గోడకు ఆనుకొని ఉంది , పడమర: రహదారి , ఉత్తరం: నారుకూరు రోడ్
మొత్తం 43 1/3 అంకణాల స్థలంలో, అందులో 2 అంకణాలు 24 చ.అడుగుల అవిభాజ్య భాగం (సర్వే నంబర్ 181/4 ప్రకారం), ఆర్.సి.సి స్లాబ్ గల ఇల్లు ఉంది.
షెడ్యూల్ – B:
"A-షెడ్యూల్" ఆస్తిపై నిర్మించిన "షిర్డీ సాయి రెసిడెన్సీ" అపార్ట్‌మెంట్‌లో 5వ అంతస్తులో ఉన్న ఫ్లాట్ నెం. 01, 1070 చ.అడుగుల విస్తీర్ణం (కామన్ ఏరియా సహా) గల డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్, సరిహద్దులు ఇలా ఉన్నాయి:
తూర్పు: ఆకాశానికి ఓపెన్ , దక్షిణం: ఆకాశానికి ఓపెన్ , పడమర: ఆకాశానికి ఓపెన్
ఉత్తరం: కామన్ కారిడార్ కొంత భాగం, మెట్లు & లిఫ్ట్ కొంత భాగం

**రుణగ్రహీత పేరు మరియు చిరునామా**

1.శ్రీమతి కొటకొండ కామేశ్వరమ్మ, S/O శ్రీ కొటకొండ సుబ్బయ్య
2.శ్రీ కొటకొండ సుబ్బయ్య, S/O శ్రీ కొటకొండ సుబ్బయ్య
చిరునామా: డోర్ నెం. 2-71, 3వ వీధి, నక్క గోపాల్ నగర్, కొత్తూరు, అంబాపురం, ఆంధ్రజ్యోతి నగర్, నెల్లూరు, ఆంధ్రప్రదేశ్, భారతదేశం – 524004

**డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం**

డిమాండ్ నోటీస్ తేదీ – 11-12-2025
లోన్ అకౌంట్ నంబర్ SHLHNELR0001039కు సంబంధించిన డిమాండ్ నోటీస్ మొత్తం రూ. 10,19,126/- (పది లక్షల పద్దెనిమిది వేల ఒక వంద ఇరవై ఆరు రూపాయలు మాత్రమే) 30-11-2025 నాటికి ఉంది.

**తనఖా ఆస్తి వివరాలు**

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, నెల్లూరు రిజిస్ట్రేషన్ జిల్లా, నెల్లూరు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్, నెల్లూరు బిట్-1, కొత్తూరు గ్రామంలో ఉన్న, టెక్నికల్ రిపోర్ట్ ప్రకారం డోర్ నంబర్ 20/1A-3-38/4, సర్వే నంబర్ 2087/1లో గల 20 అంకణాలు లేదా 160 చ.గజాల ఖాళీ స్థలం యొక్క సరిహద్దులు క్రింది విధంగా ఉన్నాయి: ఉత్తరం: గుంజి పెంచలయ్య గారి ఇల్లు , దక్షిణం: రహదారి , తూర్పు: రహదారి
పడమర: రహదారి ఈ ఆస్తి ఎస్ఆర్ఓ 917 (నెల్లూరు) ఉప-రిజిస్ట్రేషన్ జిల్లా మరియు నెల్లూరు రిజిస్ట్రేషన్ జిల్లాలో ఉంది.

స్థలం: నెల్లూరు
తేదీ: 31-03-2026
సం/- అధికృత అధికారి – ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (మునుపటి పేరు శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)

# 19న తిరుపతిలో బీసీ హక్కుల సాధన ఆత్మీయ సదస్సు



**తిరుపతి,ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బీసీల ఆత్మగౌరవమే లక్ష్యంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీల ఆత్మీయ సదస్సు ఈనెల 19న తిరుపతి రామ తులసి కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి షణ్ముగం తెలిపారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 19న ఆదివారం ఉదయం 10 గంటలకు జరుగు సమావేశానికి ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, కేంద్రంలోని బీసీ నాయకులు, రాష్ట్రంలోని బీసీ మంత్రులు ఎమ్మెల్యేలు నాయకులు, హాజరవుతారన్నారు. బీసీ మంత్రులైనటువంటి బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ,ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, పాల్గొంటారన్నారు.ఈ ఆత్మీయ సదస్సుకు దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్ర,తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరి, ప్రతినిధులతో పాటు,జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో చట్టసభలలో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, 50వేల కోట్లతో బీసీలకు ప్రత్యేక సబ్ప్లై ఏర్పాటు చేయాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రుత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరనున్నట్లు చెప్పారు. జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి సుగుణవతి యాదవ్ మాట్లాడుతూ మహిళా బిల్లులో బీసీ మహిళలకు కోట కల్పించాలని, బీసీ పరిశోధక విద్యార్థులకు రాజు ఫెలోషిప్ మంజూరు చేయాలని, బీసీల ఆదాయ పరిమితి రూ.20 లక్షలకు పెంచాలని, సంచార జాతులకు 10 శాతం విద్య ఉద్యోగ రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని ఈ సమావేశం ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేస్తామన్నారు. సమావేశంలో పూసల రవి సంచార జాతుల జాతీయ ఉపాధ్యక్షులు, జాతీయ కార్యదర్శి ఈశ్వర్ ప్రకాష్, జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి సుగుణావతి యాదవ్, జిల్లా నాయకులు జగన్నాథం, మధు,రాజాబాబు, తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నాప్ కేసులో మరో నలుగురు అరెస్ట్

**తిరుపతి,ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి జిల్లా కలెక్టరేట్ ఎదుట విద్యార్థి సంఘాల నేతల కిడ్నాప్ వ్యవహారంలో తిరుచానూరు పోలీసులు మరో నలుగురిని గురువారం అరెస్టు చేశారు. విద్యార్థి సంఘం నేతల కిడ్నా వ్యవహారంలో మోహన్ బాబు యూనివర్సిటీ యాజమాన్యం, సిబ్బందిపై తిరుచానూరు పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే 13 మందిని అరెస్టు చేయగా విచారణలో మరో 4 గురిని అరెస్ట్ చేశారు.మధు, కిరణ్ కుమార్ రెడ్డి, హరికృష్ణ, కిషోర్ అనే నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు తిరుచానూరు సిఐ సునీల్ కుమార్ తెలిపారు.



# ఏకైక శాశ్వత రాజధాని అమరావతే!

### - అమరావతికి చట్టబద్ధతపై ఆర్సీపురంలో భారీ క్యాండిల్ ర్యాలీ

**రామచంద్రపురం, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రానికి ఏకైక శాశ్వత రాజధాని అమరావతేనని పార్లమెంటులో చట్టబద్ధత కల్పించడం హర్షనీయమని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి అన్నారు. గురువారం పార్లమెంటులోని ఉభయ సభలలో ఆంధ్రప్రదేశ్కు అమరావతిని ఏకైక రాజధానిగా చట్టబద్ధత కల్పించడం పట్ల ఆర్సీపురం ప్రధాన కూడలి వద్ద టిడిపి నాయకులు భారీ క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజిత ఆంధ్రప్రదేశ్ రాజధానిగా 2014లో అమరావతిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అనంతరం వైసిపి ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమరావతి రాజధానిని చిన్న భిన్నం చేసి మూడు రాజధానులు పేరుతో మూడుముక్కలాటలు ఆడారని విమర్శించారు. అమరావతి రైతులు 1631 ఆందోళన చేసి, న్యాయస్థానం నుండి దేవస్థానం వరకు పాదయాత్రలు చేసి అమరావతి రాజధాని సాధన కోసం చేసిన పోరాటాలు అమోఘమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి శాశ్వత రాజధానిగా చట్టపతులు చేసేంతవరకు పట్టు వదలని విక్రమార్కుడిలా కృషి చేశారని తెలిపారు. మన రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్... మన రాష్ట్ర శాశ్వత ఏకైక రాజధాని అమరావతి అని నినాదాలు చేశారు. కేంద్రంలోని ప్రభుత్వం పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోం శాఖ మంత్రి అమిత్ షా, వివిధ పార్టీల పార్లమెంటు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ జనార్దన్ చౌదరి, ఈ. ఉమాపతి నాయుడు, సి.వెంకట ప్రసాద్ కే నరసింహారెడ్డి, ఢిల్లీనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి జిల్లా

## అమరావతికి చట్టబద్ధత..కేంద్రం నిబద్ధత

### - మండలాధ్యక్షుడు రావిళ్ళ మునిరాజనాయుడు



**తొట్టంబేడు, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం తొట్టంబేడు మండల నాయకులు మండల కార్యాలయం నందు రావిళ్ళ మునిరాజా నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా బాణాసంచా కాల్చి సీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి మరియు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం 5 కోట్ల ప్రజల ఆకాంక్ష అయిన అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు పూర్తి మెజారిటీతో పార్లమెంటు ఆమోదం లభించడానికి కృషి చేసిన ప్రధాని నరేంద్ర మోదీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఏపీ విద్య–ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో తొట్టంబేడు మండల అధ్యక్షులు రావిళ్ళ మునిరాజా నాయుడు, మాజీ మండల అధ్యక్షులు గాలి మురళి నాయుడు, సింగిల్ విండో చైర్మన్ భీమల భాస్కర్, తొట్టంబేడు మండల ప్రధాన కార్యదర్శి మణి, గుర్రప్ప నాయుడు కండిగ లెక్కల మురళి నాయుడు, తొట్టంబేడు మండల తెలుగు యువత అధ్యక్షుడు వట్టికుండల పవన్ నాయుడు, మండల మహిళా అధ్యక్షురాలు రమాదేవి, సర్పంచ్ మాధవి, ఆయా కట్టు వైస్ చైర్మన్ ఘట్టమనేని శంకర్ నాయుడు, జనసేన నాయకుడు అంజూరు చక్రధర్, క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్చార్జిలు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## గాంధీ పురంలో చోరీ: రూ.6 లక్షల 20 వేలు అపహరణ

**తిరుపతి,ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీ పురంలో ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డ సంఘటన ఆలస్యంగా వెలుగు లోకి నెల 30న కుటుంబ సభ్యులతో పాకాలకు వెళ్లిన లోకేష్ కుటుంబం ఈనెల 1న తిరిగి గాంధీ పురం లోని తమఇంటికి వచ్చారు. ఇంటి తలుపులు తెరచి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించిన యజమాని లోకేష్ ఇంటిలోని అటకపై అట్టపెట్టెలో ఉంచిన 6,20,000 నగదు చోరీకి గురి అయినట్లు గుర్తించారు. తిరుపతి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఫిర్యాదు. సీఐ మద్దయ్య చారి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## వైభవంగా శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ధ్వజస్తంభ బంగారు తాపడ సంప్రోక్షణ మహోత్సవం

### - బంగారు తాపడం చేయించిన ఎంపీ వేమిరెడ్డి దంపతులు



**నెల్లూరు, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి దంపతుల సౌజన్యంతో నెల్లూరు రూరల్ పరిధిలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ ధ్వజస్తంభ బంగారు తాపడం సంప్రోక్షణ మహోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. గురువారం ఉదయం వేద మంత్రోచరణల మధ్య నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతమ్మ దంపతులు, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా ఆలయానికి చేరుకున్న వేమిరెడ్డి దంపతులకు టిడిపి నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఆహ్వానం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్న వేమిరెడ్డి దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంప్రోక్షణ కార్యక్రమంలో పాల్గొని యజ్ఞ యాగాది క్రతువులు నిర్వహించారు. అనంతరం బంగారు తాపడం చేయించిన ధ్వజస్తంభాన్ని ఆవిష్కరించగా ధగధగ మెరుపులతో అద్భుతంగా దర్శనమిచ్చింది. భక్తులు తన్మయత్వం చెందారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులు మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులతో ఆలయ ధ్వజస్తంభానికి బంగారు తాపడం చేయించడం తమ అదృష్టం అన్నారు. అమ్మవారి దయతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. గతేడాది జులైలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట చేపట్టామని, 8 నెలలకే ధ్వజ స్తంభానికి బంగారు తాపడం చేయించడం హర్షనీయమన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలన్నారు. నెల్లూరు జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని వారు ఆకాంక్షించారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఆలయ ధ్వజ స్తంభానికి బంగారు తాపడం చేయించిన వేమిరెడ్డి దంపతులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. స్వామివారి కటాక్షం వారిపై ఎప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, ఆలయ ఈఓ, అర్చకులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో రోడ్డుపై దూకుడు

### - వ్యక్తి మృతి



**వెంకటగిరి, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నాయుడుపేట రోడ్డులోని మెల్చూరు గ్రామ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మృతుడిని ఒజిలి మండలం అత్తివరం గ్రామానికి చెందిన పెదికూరు ప్రదీప్ రెడ్డి(40)గా గుర్తించారు. మేనకూరు సెజ్ నాయుడుపేట నుండి వెంకటగిరి వైపు వెళ్తున్న బ్రేక్స్ ఇండియా బస్సు ఈ ప్రమాదం జరిగింది. మెల్చూరు గ్రామంలోని మద్యం దుకాణం సమీపం నుండి మృతుడు అకస్మాత్తుగా ప్రధాన రోడ్డుపైకి రావడంతో, క్రాస్ రోడ్ వద్ద బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మృతుడు ఘటన స్థలంలోనే మరణించాడు. ప్రమాద సమయంలో బైక్ ఫ్యూయల్ ట్యాంక్ పేలడంతో అగ్ని ప్రమాదం సంభవించి, బ్రేక్స్ ఇండియా బస్సు పూర్తిగా దగ్ధమైంది. అయితే, బస్సులో ఉన్న డ్రైవర్‌తో పాటు మొత్తం 38 మంది కార్మికులు సురక్షితంగా బయటపడ్డారు.

## మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులదే బాధ్యత

### - భారీగా ఫైన్లు విధిస్తాం... వాహనాలు సీజ్ చేస్తాం
### - అనంతపురం అర్బన్ డీఎస్పీ వెల్లడి



**అనంతపురం, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు నిబంధనలకు విరుద్ధంగా టూవీలర్లు నడిపిన మైనర్ల తల్లిదండ్రులతో అనంతపురం అర్బన్ పోలీసుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతపురం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత, చట్టపరమైన అవగాహన పెంపొందించేందుకు కీలక చర్యలు కొనసాగుతున్నాయి. జిల్లా ఎస్పీ పి జగదీష్ ఆదేశాల మేరకు ఈరోజు నగరంలోని స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో మైనర్లకు వాహనాలు ఇస్తున్న తల్లిదండ్రులకు ప్రత్యేక కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనంతపురం అర్బన్ డీఎస్పీ వి శ్రీనివాసరావు అధ్యక్షత వహించి, మైనర్ల తల్లిదండ్రులతో ప్రత్యక్షంగా సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల జరిగే ప్రమాదాల తీవ్రతను వివరంగా చర్చించారు. ట్రాఫిక్ నియమాలను పాటించకపోతే కలిగే ప్రమాదాలు, ప్రాణ నష్టం, కుటుంబాలపై పడే మానసిక మరియు ఆర్థిక భారం గురించి ఉదాహరణలతో వివరించారు. అదేవిధంగా, మోటార్ వాహన చట్టం ప్రకారం మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై తీసుకునే చట్టపరమైన చర్యలను స్పష్టంగా తెలియజేశారు. మైనర్లు వాహనాలు నడిపిన సందర్భంలో జరిగే ప్రమాదాలకు తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని, జరిమానాలు, కేసులు, అవసరమైతే జైలుశిక్ష కూడా ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల భద్రతపై మరింత శ్రద్ధ చూపాలని, చట్టాలను గౌరవించాలని, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించేలా ప్రోత్సహించాలని అధికారులు సూచించారు. యువతలో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు కుటుంబం మొదటి బాధ్యత వహించాల్సి ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్, రాజేంద్రనాథ్ యాదవ్, వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పలువురు ఎస్సైలు మరియు పోలీస్ సిబ్బంది హాజరై కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బయోచార్, బయోచార్ ఎరువుల క్షేత్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



**గోరంట్ల,ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలం లోని పూలచెట్లపల్లి గ్రామంలో బయోచార్ మరియు బయోచార్ ఎరువులు తయారు చేస్తున్న 2ఙూ0 ఖీుతీఎం బయోచార్ కేంద్రాన్ని గౌరవ జిల్లా కలెక్టర్ గారు గురువారం నాడు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పంట దిగుబడి మరియు నేల సారంపై బయోచార్ చూపే ప్రభావం గురించి రైతులతో ముఖాముఖి మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పంట వ్యర్థాలను పైరాలసిస్ అనే పద్ధతిలో కాల్చి తయారుచేసిన బొగ్గును బయోచార్ అంటారు. బయోచారులో 80 శాతానికి పైగా కార్బన్ ఉంటుంది. ఇలా తయారు చేసిన బయోచార్ ని వ్యవసాయంలో వాడితే రైతులకు కలిగే ప్రయోజనాలను గౌరవ కలెక్టర్ గారికి 2ఙూ0 ఖీుతీఎం నిర్వాహకులు తేజస్ రాజ్ విహార్ మరియు రైతు శ్రీనివాస్ రెడ్డి వివరించారు.నేలలో బయోచార్ వేస్తే మట్టిలోని కార్బన్ శాతం పెరుగుతుంది. నేలలో నీటిని, ఎరువుల్ని ఒడిసిపట్టే తత్వం పెరుగుతుంది. నేల బాగా వదులుగా మారుతుంది. నాణ్యమైన బయోచార్ ఒక్క సారి నేలలో వేస్తే వందల సంవత్సరాల పాటు చెట్లకు, మట్టికి మేలు చేస్తుంది. ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తుంది. రైతులు బయోచార్ ఉపయోగాలు తెలుసుకొని చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉత్పత్తి అవుతున్న పంట వ్యర్థాలను బయోచార్ గా మార్చడానికి తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ గారు సూచించారు.ఈ కార్యక్రమంలో డిపిఓ సమత, డివిజనల్ అభివృద్ధి అధికారి రామకృష్ణయ్య,డీపీఆర్సీ జిల్లా కో ఆర్డినేటర్ నరేష్ కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న మంత్రి పయ్యావుల

**అనంతపురం, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఉరవకొండ మండలం పెన్నఅహోబిలంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ గురువారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయానికి చేరుకున్న మంత్రికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదఆశీర్వాదం, తీర్థప్రసాదాలను మంత్రికి ఆలయ అర్చకులు అందజేశారు. తదనంతరం ఆలయ పరిసరాలను, కోనేరును మంత్రి పరిశీలించారు.ఆ తరువాత పెన్నఅహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధిపై ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు, ఆయా శాఖల అధికారులతో మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ సమీక్ష నిర్వహించారు.

## అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

### - పార్లమెంట్‌లో అంబికా లక్ష్మీనారాయణ విజ్ఞప్తి



**అనంతపురం,ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పార్లమెంట్‌లో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న టెట్ సమస్యపై కేంద్ర ప్రభుత్వ దృష్టి తీసుకువచ్చారు. గురువారం పార్లమెంట్‌లో ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తప్పనిసరిగా టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ ఉత్తీర్ణులు కావాలని, రెండు సంవత్సరాల్లోపు ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించని వారు తమ ఉద్యోగ అర్హతను కోల్పోతారని విద్యా హక్కు చట్టం ప్రకారం ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. దాదాపు 30 నుంచి 40 సంవత్సరాల అనుభవం కలిగిన సీనియర్ ఉపాధ్యాయులు కూడా ఇప్పుడు టెట్ పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీనివల్ల వారి ఉద్యోగ భద్రతపై తీవ్ర ఆందోళన నెలకొంటోందని ఆయన పేర్కొన్నారు. అలాగే, విద్యా హక్కు చట్టం అమల్లోకి రాకముందే డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్‌లోని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయని అంబికా లక్ష్మీనారాయణ వివరించారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలంటే 2009 నాటి విద్యా హక్కు చట్టంలో తగిన సవరణలు చేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. కావున ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఈ కీలక సమస్యను కేంద్ర ప్రభుత్వం గమనించి, విద్యా హక్కు చట్టంలో అవసరమైన సవరణలు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని లోక్‌సభ వేదికగా అంబికా లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని కోరారు.

## "ప్రజాదర్బార్" సమస్యల పరిష్కారానికి కృషి

### - మంత్రి పయ్యావుల కేశవ్



**అనంతపురం, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగరంలోని రామ్ నగర్ లో ఉన్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం "ప్రజా దర్బార్" కార్యక్రమాన్ని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ నిర్వహించారు. ఈ ప్రజాదర్బార్ కార్యక్రమంలో వివిధ రకాల ప్రజా సమస్యలపై ప్రజలు, నాయకుల నుంచి వినతి పత్రాలను మంత్రి పయ్యావుల కేశవ్ స్వీకరించారు. సమస్యలను పరిష్కరించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళు లాంటివని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తూ.. అనేక అభివృద్ధి పనులు చేయడం జరుగుతోందని, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లడం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు, నాయకులు, ప్రజల సమస్యలను అర్జీల రూపంలో స్వీకరించి, ఎలాంటి ఆలస్యం కాకుండా ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తక్షణం చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

## రైతుల భూహక్కులకు పూర్తి భద్రతే లక్ష్యం

### - పాసు పుస్తకాలు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్

**కమ్మవారి పల్లె,ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రైతుల భూహక్కులకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ స్పష్టం చేశారు. గురువారం గోరంట్ల మండలం, కమ్మవారి పల్లె గ్రామంలో నిర్వహించిన నూతన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, ప్రభుత్వ రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాసు పుస్తకాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను రైతులకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. భూముల కొనుగోలు సమయంలో సర్వే చేయించుకోకపోవడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయని, భూమిని కొనేటప్పుడు తప్పనిసరిగా సర్వే చేయించుకొని, కొనుగోలు చేసిన మేరకే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రైతులకు, ప్రజలకు సూచించారు. సర్వే చేయకుండా భూమి కొనుగోలు చేస్తే పత్రాల్లో ఉన్న వివరాలకు, భూమిపై ఉన్న వాస్తవ పరిస్థితికి తేడాలు వస్తాయని తెలిపారు. ఈ సమస్య రాష్ట్రంలోనే కాక ఇతర రాష్ట్రాల్లోనూ విస్తృతంగా ఉందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ మధు నాయక్ మాట్లాడుతూ... భూ రికార్డుల పారదర్శకత పెంచేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల వల్ల రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ, తహసీల్దారు, రెవెన్యూ సిబ్బంది, మండల కన్వీనర్, కూటమి నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు

**పలమనేరు,ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**మండలంలో 10వ తరగతి విద్యార్థులకు నేటితో పబ్లిక్ పరీక్షలు ప్రశాం తంగా ముగిసాయి. మండలంలో 8 పరీక్ష కేంద్రాలలో 1395 మంది విద్యార్థులకు గాను నేడు ఆంగ్ల పరీక్షకు 1385 మంది విద్యార్థులు హాజరైనారు. 10 మంది విద్యార్థులు గర్హాజరైనారు.అన్ని కేంద్రాల లోను విద్యార్థులకు ఫర్నిచర్, త్రాగునీరు మరియు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించబడినది. మండలంలో 10వతరగతి పరీక్షలు ప్రశాంతంగా జరగడానికి సహకారం అందించిన హెడ్ మాస్టర్స్, టీచర్స్, వైద్య సిబ్బందికి, పోలీసు శాఖా వారికి ధన్యవాదాలు తెలుపుతున్నామని మండల విద్యా శాఖాధికారి లీలారాణి, మండల విద్యా శాఖాధికారి 2 బాల సుందరం తెలియజేసినారు.

# అమరావతికి పార్లమెంట్ ఆమోదం పట్ల హర్షం



**పలమనేరు,ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజధానిగా అమరావతిని గుర్తిస్తూ పార్లమెంటు ఆమోదించడం పట్ల తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష కార్యదర్శులు పి.తులసి నాథం నాయుడు, కె.పుష్ప హర్షం ప్రకటించారు. పార్లమెంటు సభ్యులు పార్లమెంటులో తెలుగులో ఉద్వేగంగా మాట్లాడటం హర్షణీయమ న్నారు. తెలుగువారి రాజధాని అమరావతిలో అడుగడుగునా తెలుగు భాష కనపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇదే స్ఫూర్తితో తెలుగు భాష రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

# పలమనేరు లాడ్జిలలో పోలీసుల తనిఖీ

**పలమనేరు, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**పట్టణంలో ఉన్న లాడ్జిలను గురువారం పలమనేరు అర్బన్ సీఐ మోహన్ రెడ్డి సిబ్బందితో కలిసి తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా ఎవరైనా ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ బెట్టింగులు ఆడుతున్నారనే సమాచారంతో తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.. ఎవరైనా క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# టిడిపి నాయకుల సంబరాలు



**పుంగనూరు, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలో మండల టిడిపి నాయకులు గురువారం రాత్రి అంబేద్కర్ సర్కిల్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి బాణసంచా కాల్చి అమరావతి రాజధానిగా ప్రకటించినందుకు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రుల కల అమరావతిని రాజధానిగా చేసిన మా నాయకుడు చంద్రబాబు నాయుడుకి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి మన ప్రధాని నరేంద్ర మోడీ కి ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు సుబ్రమణ్యం రాజు, మోర్ పూరి రమేష్, సాతర్ల సుబ్రహ్మణ్యం, మోదుగులపల్లి పంచాయతీ ఉపాధ్యక్షులు మనోజ్, సంజీవ, రామయ్య, మోహన్ నాయుడు, సుధాకర్, లింగోల్ల నవీన్, ఎల్.వి రమణ పెద్ద సంఖ్యలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధతపై హర్షం



**పలమనేరు, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**పలమనేరు పట్టణంలో కూటమి నాయకులు ఏపీ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించడాన్ని స్వాగతిస్తూ స్థానిక శ్రీ కాశీ విశ్వేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించి జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ఆలయం వద్ద నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు సాగిన ఈ ర్యాలీలో జై అమరావతి జై జై అమరావతి అంటూ నినాదాలు చేసుకుంటూ ముందుకు సాగారు. అనంతరం బాణసంచా పేలుస్తూ స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలమనేరు కో-ఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్ వి బాలాజీ, పలమనేరు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆర్ బి సి కుట్టి, నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు నాగరాజు, బిజెపి నాయకులు వంశీ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల మాస్టర్ హెల్త్ చెకప్ క్యాంప్ విజయవంతం

## -కుటుంబ సభ్యులతో తరలి వచ్చిన మీడియా ప్రతినిధులు



**చిత్తూరు, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేకంగా నిర్వహించిన మాస్టర్ హెల్త్ చెకప్ క్యాంప్‌కు విశేష స్పందన లభించింది. జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా పరిపాలన, ఐ అండ్ పిఆర్ విభాగం సమన్వయంతో అపోలో సంస్థ సహకారంతో గురువారం చిత్తూరు జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి (జిహెచ్‌హెచ్)లో నిర్వహించిన ఈ మెగా వైద్య శిబిరానికి జిల్లావ్యాప్తంగా మీడియా ప్రతినిధులు కుటుంబ సభ్యులతో కలిసి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సమగ్ర వైద్య పరీక్షలు చేయించుకుని ఆరోగ్య పరిస్థితిపై అవగాహన పొందారు. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమైన ఈ వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్స్, చర్మవ్యాధులు, ఈఎన్‌టీ, కంటి వైద్య విభాగాల్లో నిపుణుల సేవలు అందించారు. మహిళల కోసం గైనకాలజీ పరీక్షలు, పిల్లల కోసం పీడియాట్రిక్ సేవలు ప్రత్యేకంగా నిర్వహించారు. అదనంగా సీబీసీ, మూత్ర పరీక్షలు, రక్తంలో చక్కెర స్థాయిలు, కిడ్నీ, లివర్ ఫంక్షన్ టెస్టులు, కొలెస్ట్రాల్ పరీక్షలు నిర్వహించారు. అవసరాన్ని బట్టి ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఈసీజీ, ఎకో పరీక్షలు కూడా చేశారు. మహిళల కోసం మామోగ్రామ్, పాప్ స్మియర్ పరీక్షలను అందుబాటులో ఉంచారు. పరీక్షల ఫలితాల ఆధారంగా స్పెషలిస్టులు వ్యక్తిగత ఆరోగ్య సూచనలు, అవసరమైన చికిత్సలను సూచించారు. వైద్య సేవలు అంతరాయం లేకుండా జరిగేలా ఎఐఎంఎస్ఆర్, జిహెచ్‌హెచ్ అధికారులు సమన్వయం చేశారు. అవసరమైన వారికి ముందు సైతం ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో అపోలో నాలెడ్జ్ సిటీ యూనిట్ హెచ్ బాలరాజ్ ఎస్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రంగనాథ్ బి.జి., ఆసుపత్రి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రామగోపాల్ రెడ్డి ఎన్, ఐ అండ్ పిఆర్ డిడి వేలాయుదం, వివిధ విభాగాల అధిపతులు, వైద్య నిపుణులు పాల్గొన్నారు. జర్నలిస్టులు అపోలో వైద్య సేవలను ప్రశంసిస్తూ, తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపేందుకు ఈ శిబిరం ఎంతో ఉపయోగపడిందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగించాలని అధికారులు నిర్ణయించారు.

# విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలి: సీఐ



**వెంకటగిరి, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**టెన్త్, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ముగిసిన నేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏవి రమణ సూచించారు. ఎండాకాలం సెలవుల సమయంలో విద్యార్థులు నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఎండాకాల సెలవులలో పిల్లలు ఈత కోసం చెరువులు, బావులు, నదులు, కాలువలు, గుంతలు వంటి ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకూడదని హెచ్చరించారు. చిన్న నిర్లక్ష్యం ప్రాణాపాయానికి దారితీసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లలపై నిత్యం గమనిస్తూ వారు ఎక్కడికి వెళ్తున్నారో ఎవరితో కలుస్తున్నారు అనే విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. టీనేజ్ వయసులో పిల్లలు చెడు స్నేహాలు, చెడు అలవాట్లు, వ్యసనాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, అలాంటి పరిస్థితులను నివారించేందుకు తల్లిదండ్రులు వారికి మంచి మార్గదర్శనం చేయాలని తెలిపారు. మొబైల్ ఫోన్ వినియోగం, సోషల్ మీడియా ప్రభావం వంటి అంశాల్లో కూడా నియంత్రణ అవసరమని సూచించారు. సమ్మర్ కాలంలో రాత్రి వేళల్లో ఇళ్ల బయట నిద్రించే సందర్భాల్లో దొంగతనాలు జరిగే ప్రమాదం అధికంగా ఉంటుందని హెచ్చరించిన సీఐ, ఇళ్లకు తాళాలు వేసి భద్రతా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు తమ ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. అదేవిధంగా శుభకార్యాల కోసం ఇంటిని ఖాళీగా వదిలి వెళ్లేటప్పుడు స్థానిక పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వడం ద్వారా భద్రతను పెంచుకోవచ్చని చెప్పారు. సీసీ కెమెరాలు, లైటింగ్ వంటి భద్రతా ఏర్పాట్లు కూడా ఉపయుక్తమని సూచించారు. సెలవులను సద్వినియోగం చేసుకోవాలని, విద్యార్థులు క్రీడలు, పుస్తక పఠనం, నైపుణ్యాల అభివృద్ధి, ఉన్నత విద్య ప్రణాళికపై దృష్టి పెట్టాలని తెలిపారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను ప్రోత్సహిస్తూ, వారి భవిష్యత్తు లక్ష్యాల వైపు దారి చూపించాలని సూచించారు. మొత్తానికి సమ్మర్ సెలవులను సురక్షితంగా, ప్రయోజనకరంగా గడపాలని సీఐ ఏవి రమణ పిలుపునిచ్చారు.

# వార్డు సభ్యులను, పారిశుద్ధ కార్మికులను సన్మానించిన సర్పంచ్



**వి.కోట, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**తమ పదవీ కాలం ముగియడంతో వి.కోట మేజర్ పంచాయతీ సర్పంచ్ పి ఎన్ లక్ష్మమ్మ వార్డు సభ్యులను, పంచాయతీ కార్మికులను సన్మానించినారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రజలు తమపై నమ్మకం తో ఐదు సంవత్సరాలు తమకు సర్పంచుగా సేవలందించేందుకు అవకాశం ఇచ్చినందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎప్పుడూ లేని విధంగా వి.కోటను అభివృద్ధి పథంలో నడిపించి పంచాయతీ కు గణనీయంగా రెవెన్యూ ను పెంచిన ఘనత తమకే దక్కుతుందని వారు తెలిపారు. మంత్రివర్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైకాపా స్టేట్ సెక్రటరీ నాగరాజు సహకారంతో వి.కోటను ప్రగతి పదంలో నడిపించగలిగామని, వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పంచాయతీ కు అన్నివేళలా అందుబాటులో ఉంటూ వి.కోటను పారిశుద్ధ్యంగా ఉంచిన పరిశుద్ధత కార్మికులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమస్యలు ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేందుకు తోడ్పడిన వార్డు మెంబర్లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరిలో పాటు వైకాస్టేట్ సెక్రటరీ నాగరాజు, ప్రభుత్వ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సచివాలయ సేవలు వేగంగా అందాలి

## - జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**మదనపల్లె/ కురబలకోట, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం నందిరెడ్డి గారిపల్లె గ్రామ సచివాలయాన్ని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు విధానం, ప్రజల వినతులు--ఫిర్యాదుల పరిష్కార విధానాన్ని సమగ్రంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గ్రామ సచివాలయ సిబ్బంది ప్రతిరోజూ సమయానికి విధులకు హాజరై ప్రభుత్వం అమలు చేస్తున్న ఫేషియల్ అటెండెన్స్ విధానాన్ని తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. హాజరు వ్యవస్థ కచ్చితంగా అమలు చేస్తే సేవలలో పారదర్శకత, బాధ్యత పెరుగుతాయన్నారు. సచివాలయ సేవలు ప్రజలకు సులభంగా, పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు. ప్రజల నుండి స్వీకరించిన వినతులు, ఫిర్యాదులను, అలాగే జిల్లా కేంద్రం నుండి పంపబడే వినతులు, వివిధ శాఖల సూచనలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులో పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా గ్రామస్థుల సమస్యలను ప్రతి సిబ్బంది బాధ్యతాయుతంగా ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా భూ రికార్డులు, ల్యాండ్ రిజిస్టర్లను కూడా పరిశీలించిన కలెక్టర్, అన్ని రికార్డులను సక్రమంగా నవీకరించి నిర్వహించాలని అధికారులకు సూచించారు. భూ వివరాలు స్పష్టంగా నమోదు చేయడం ద్వారా భూ వివాదాలు తగ్గి ప్రజలకు సులభంగా సేవలు అందుతాయని పేర్కొన్నారు. సచివాలయంలో అన్ని శాఖల వివరాలను డిజిటల్ విధానంలో నవీకరించడంతో పాటు పెండింగ్ ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించి అర్హులందరికీ ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం వివిధ అంశాలలో పలు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దారు ధనుంజయులు, ఎంపీడీవో గంగయ్య, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# చిత్తూరు జిల్లా

# మహిళను హత్య చేసిన వ్యక్తి అరెస్ట్



**పలమనేరు, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**మహిళను హత్య చేసిన వ్యక్తి అరెస్ట్ చేసిన సంఘటన మండలంలో సంచలం సృష్టించింది. డి.ఎస్.పి డేగల ప్రభాకర్, కథనం మేరకు వివరాలు ఎలా... పెద్దపంజాణి మండలంలోని చలమంగళం పంచాయతీ పెద్ద మిద్దె పల్లికి చెందిన చంద్రమ్మ(33) చలపతి అను ఆమె పుంగనూరులో టైలరింగ్ పనిచేస్తూ చీటీలు వడ్డీకి ఫైనాన్స్ వ్యాపారం చేస్తూ ఉంది. మార్చి 30న సాయంకాలం సుమారు 7 గంటల సమయంలో కనిపించకుండా పోయిందని పెద్దపంజాణి పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేశారు. చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ దూడే వారి ఆదేశాల మేరకు డి.ఎస్.పి ప్రభాకర్ సూచనల మేరకు పలమనేని రూరల్ సీఐ పరశురాముడు ఎస్సై మారెప్ప వారితో కలిసి కేసు దర్యాప్తు జరిపి అనుమానితులుగా ఉన్న జంగాలపల్లి సుబ్రహ్మణ్యంను మార్చి 31న రాత్రి ముత్తుకూరు క్రాస్ వద్ద ఫీడ్ ఫ్యాక్టరీ బస్సు స్టాప్ వద్ద పట్టుకొని విచారించగా సదరు ముద్దాయి జంగాలపల్లి సుబ్రహ్మణ్యం ఇచ్చిన నేర ఒప్పుదల మేరకు చంద్రమ్మ వద్ద చీటీలు వేసి వాటిని పాడి డబ్బులు ఎత్తుకొని రూ.40 వేలు అప్పుగా తీసుకొని ఆ డబ్బులను ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్ ఆడి డబ్బులు పోగొట్టుకున్నట్లు అప్పులు తీర్చలేక పోయినట్లు చీటీ డబ్బులు అడుగుతున్న చంద్రమ్మను చంపాలని తన స్నేహితులు దేవి వరప్రసాద్, షేక్ నూర్ మహమ్మద్ లతో కలిసి పథకం ప్రకారం జంగాలపల్లి సుబ్రహ్మణ్యం తన మోటార్ సైకిల్‌లో చంద్రమ్మను తీసుకుని డబ్బులు నిడుగుంటలో అతని బావమరిది దేవీ వరప్రసాద్ దగ్గర డబ్బులు ఇప్పిస్తాను అని పెద్దపంజాణి నుండి తీసుకువెళ్లి మార్గమధ్యంలో తులసి మునెమ్మ గుడి సమీపాన గల ఒక మామిడి తోపులో తన స్నేహితులతో కలిసి చంద్రమ్మను తలపై ఇనుప రాడ్‌తో కొట్టి కత్తితో గొంతు కోసి నేరంను దాచుటకు శవంను జంగాలపల్లి సుబ్రహ్మణ్యం స్నేహితులైన దేవీ వరప్రసాద్, షేక్ నూర్ మహమ్మద్‌లు తెచ్చిన బొలేరో వాహనంలో తీసుకువెళ్లి జగమర్ల వద్ద గల అటవీ ప్రాంతంలో పడవేసినట్లు నేరం ఒప్పుకున్నారు. ముద్దాయి జంగాలపల్లి సుబ్రహ్మణ్యం ఏప్రిల్ 1న ఉదయం అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు పంపారు. దర్యాప్తులో సాంకేతికతను ఉపయోగించి అనుమానతుడైన జంగాలపల్లి సుబ్రహ్మణ్యంను మార్చి 31న రాత్రి ముత్తుకూరు క్రాస్ సమీపం ఫ్యాక్టరీ బస్ స్టాప్ వద్ద అతన్ని పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకున్నారు. మిగిలిన నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టివారి ఇద్దరిని కూడా అరెస్టు చేస్తామని పెద్దపంజాణి, సీఐ పరశురాముడు, ఎస్సై మారెప్ప తెలిపారు.

# సర్పంచ్‌కు ఘన వీడ్కోలు పలికిన గ్రామస్తులు



**పెద్దపంజాణి,ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడైన శంకర్ రాయలపేట సర్పంచ్ హరినాథ్‌కు గ్రామస్థులు, సచివాలయ సిబ్బంది గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. నేటితో సర్పంచుల పదవీకాలం ముగియడంతో శంకర్ రాయలపేట గ్రామస్థులు సర్పంచ్, వార్డు సభ్యులకు గౌరవ ప్రధంగా సన్మానం నిర్వహించారు. అలాగే గత మూడు దఫాలుగా ఏకగ్రీవ సర్పంచుగా ఎన్నికవుతు గ్రామస్థులు అందరితో స్నేహశీలిగా మెలుగుతూ తమ కుటుంబ సభ్యుడి వలె నడుచుకుంటూ గ్రామాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ అజాతశత్రువుగా హరినాథ్ ప్రజల గుండెల్లో మంచి స్థానం సంపాదించుకోవడం హర్షించదగ్గ విషయమని మండల కన్వీనర్ బాగా రెడ్డి వ్యాఖ్యానించారు. అనంతరం సన్మాన గ్రహీత సర్పంచ్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో మూడుసార్లు తనకు సర్పంచ్ పదవి కట్టబెట్టిన గ్రామస్తులకు ఎప్పుడు రుణపడి ఉంటానని తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జీడి బాబు, గ్రామస్థులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# స్కూల్‌కు చేయూత అందించిన ఆర్మీ జవాన్



**రామసముద్రం,ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మట్లావారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి పనుల కోసం అదే పాఠశాలలో చదివి ప్రస్తుతం ఆర్మీలో సేవలందిస్తున్న గుట్టమీద చిన్న రాజప్ప రూ.5 వేలు విరాళం అందజేశారు. పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందించడం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల హెడ్మాస్టర్ పి. వెంకటరమణ నాయుడు మాట్లాడుతూ, చిన్న రాజప్ప వంటి మాజీ విద్యార్థులు ముందుకొచ్చి పాఠశాల అభివృద్ధికి చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు, పాఠశాల చైర్మన్ కృష్ణప్ప కూడా ఆయన సేవలను ప్రశంసించారు. ఇలాంటి సేవాభావం ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. భవిష్యత్తులో కూడా పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

# పాత పుస్తకాలకు నగదు, విద్యాసామాగ్రి పంపిణీ



**రామసముద్రం,ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలంలోని కేసీ పల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ప్రత్యేక స్వచ్ఛత డ్రైవ్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లతీఫ్ ఖాన్, పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్, స్వచ్ఛ రథం ఆపరేటర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యా యులతో కలిసి పాత పుస్తకాలు, నోట్స్, పేపర్లు సేకరించారు. సేకరించిన వాటిని స్వచ్ఛ రథం ద్వారా తరలించారు. అలాగే పాత పుస్తకాలను అందజేసిన విద్యార్థులకు ప్రభుత్వం నిర్ణయించిన రేటు ప్రకారం నగదు, విద్యా సామాగ్రి అందజేశారు. గ్రామంలో పరిశుభ్రతను పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. గ్రామాలను స్వచ్ఛంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

# నిడిగుంటలో ఘనంగా 'స్వచ్ఛ రథం'



**పెద్దపంజాణి, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గురువారం ఉదయం నిడిగుంట జడ్పీ హైస్కూల్ నందు విద్యార్థుల నుండి పాత పుస్తకాలు, ఉపయోగించని కాగితాలను, వ్యర్థ పదార్థాలను సేకరించడం జరిగింది. మధ్యాహ్నం నిడిగుంట వీధుల్లో 'స్వచ్ఛ రథం' ద్వారా తిరుగుతూ ప్రజల వద్ద ఉన్న వ్యర్థ పదార్థాలను సేకరించారు. కార్యక్రమం గురించి ముందుగానే గ్రామస్థులకు దండోరా, అనౌన్స్‌మెంట్‌ల ద్వారా ఒక రోజు ముందే అవగాహన కల్పించడంతో ప్రజలు, విద్యార్థుల నుండి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణ కోసం వ్యర్థాలను తగ్గించి, పాత పుస్తకాలను, నిరుపయోగ వస్తువులను సేకరించి, ప్లాస్టిక్ నివారించి, వ్యర్థ పదార్థాలను సద్వినియోగం చేసే ఉద్దేశంతో ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఎంజీఓ సుధాకర రావు, హై స్కూల్ హెడ్మాస్టర్ నౌషాద్, మండల స్థాయి అధికారులు, నిడిగుంట గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి వాణి, స్థానిక ప్రజా ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నారు.

## ఆంధ్రుల ఆత్మగౌరవం రాజధానికి చట్టబద్ధత: ఎమ్మెల్యే



**మదనపల్లె,ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రుల ఆత్మగౌరవ ప్రతీక అమరావతికి నేడు చారిత్రాత్మక విజయం లభించిందని ఎమ్మెల్యే షాజహాన్ భాష పేర్కొన్నారు.. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి విడిపోయి కొన్ని సంవత్సరాలు కావస్తున్న నేపథ్యంలో మార్చి 28న ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో తీర్మానం చేసి పంపిన బిల్లును ఉభయ సభలలో ఆమోదం పొందిన నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా వ్యాప్తంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ తెలుగువారు సంబరాలు చేసుకుంటున్నారని హర్షం వ్యక్తం చేశారు. 34 వేల ఎకరాలలో రాజధాని నిర్మాణం వేగవంతంగా జరుగుతుంటే రాజధాని అభివృద్ధి గిట్టని జగన్మోహన్ రెడ్డి వైసీపీ నేతలు అసత్యాలు మాట్లాడడం తగదని విమర్శించారు. ఎన్డీఏ ప్రధాని నరేంద్ర మోడీ ఆశీస్సులతో త్వరలో రాష్ట్రపతి ఆమోదం పొంది గెజిట్ రాబోతుందని ఎమ్మెల్యే షాజహాన్ భాష ఆనందం వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ నియంత్రణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

**- డిస్ట్రిక్ట్ అడిషనల్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డా.ఎల్ రాధిక**




**మదనపల్లె,ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని డిస్ట్రిక్ట్ అడిషనల్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డా.ఎల్ రాధిక హెచ్చరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ల్యాబ్ టెక్నీషియన్స్, ఐసీటీసీ కౌన్సిలర్లు, వైద్యులతో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ మిషన్ ఎయిడ్స్ సురక్ష (మాస్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణకు సంబంధించిన కార్యక్రమాలను ప్రతి స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రజలకు అవసరమైన పరీక్షలు, కౌన్సెలింగ్, చికిత్స సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా ఆరోగ్య కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రత్యేకంగా హెచ్ఐవి పరీక్షలు, కౌన్సెలింగ్ సేవలు, అవసరమైన మందుల సరఫరాలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆమె పేర్కొన్నారు. హెచ్ఐవి నిర్ధారణ అయిన వ్యక్తులకు సమయానికి చికిత్స అందించడం ద్వారా వైరస్ వ్యాప్తిని సమర్థవంతంగా నియంత్రించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ భాస్కర్, వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఐసీటీసీ కౌన్సిలర్లు, టి.ఐ. ప్రాజెక్టు సిబ్బంది పాల్గొన్నారు.

## చేనేతలకు పవర్ గిఫ్ట్ హర్షణీయం

**జిల్లా అధ్యక్షుడు నూకల పెంచలయ్య**

**కడప,ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలోని చేనేతలకు పవర్ గిఫ్ట్ అమలు చేయడం హర్ష ణీయమని చేతి వృత్తుల ఐక్య వేదిక పార్టీ జిల్లా అధ్యక్షుడు నూకల పెంచలయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మగ్గాలకు 200, మరమగ్గాలకు 500 యూనిట్లు ఫ్రీగా ఇవ్వడం మంచిదే అన్నారు. చేనేతలుకు టుంబం మొత్తం కలిసి పని చేస్తే తప్ప పూటగడవని పరిస్థితి ఉంద న్నారు. ప్రభుత్వం నేటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత విద్యుత్ అమలు చేయడం మంచిదే కానీ ప్రభుత్వం చిత్తశుద్ధితో అందించాలని కోరారు. గతంలో పట్టు రాయితీ ఉండేదని దానిని కూడా తిరిగి ప్రవేశ పెట్టా లని హితవు పలికారు. ముడిసరుకును ప్రభు త్వమే పంపిణీ చేయాలని కోరారు. చేనేతలు తయారు చేసిన పట్టు వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అన్నారు. కూటమి ప్రభు త్వం చేనేత కార్మికులకు ఇచ్చిన హామీల ను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఇం దులో బాగం గా చేనేత కార్మికులకు చేయూత పథకం కింద రూ.24 వేలు నుంచి రూ.25 వేలు ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదని ఆరోపించారు. 50 సంవత్సరాలకే కార్మికులకు పింఛన్లు మంజూరు చేస్తామని చెప్పి ఇంతవరకు చేయలేదని విమర్శించారు. చేనేత కార్మికుల అభివృద్ధి, సంక్షేమం కోసం ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే కార్మికులతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## భూమి పూజలకే టిడిపి నేతలు పరిమితం: వైసీపీ



**కడప,ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భూమి పూజలకే టిడిపి మంత్రులు, ఎమ్మెల్యేలు పరిమితం అవుతున్నారని కమలాపురం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి రవీంద్ర నాథ్ రెడ్డి విమర్శించారు. గురువా రం కడపలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవిరెడ్డి మాట్లాడారు. సిఎం చంద్రబాబు గత 15 సంవత్సరాలుగా శిలాఫలకాలు వేయడం వాటిని వదిలేయడం జరుగుతోందని చెప్పారు. ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబే అభివృద్ధి గురించి పట్టించుకోక పోతే ఇక ఆ పార్టీకి చెందిన మంత్రులు ఎలా ఉంటారో ప్రజలు గమనించాలని కోరారు. మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి భార్య ఇందిరానే వసూలు రాణిగా గుర్తింపు పొందారని ఎద్దేవా చేశారు. మంత్రి వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వెల్లడించినట్లు ఉందన్నారు. మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి కమలాపురం వచ్చి రైల్వే వంతె నకు భూమి పూజ చేసి వదిలేశారని ఆరోపించారు. అభివృద్ధి వైఎస్సార్ కుటుంబానికే సాధ్యమన్నారు.

## విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి

**- మిట్స్ వర్సిటీలో టెక్నికల్ సింపోసియం జిమాక్స్-2కే26లో ఎమెల్డా బానుమతి**



**మదనపల్లె/ కురబలకోట,ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విద్యార్థులు పరిశ్రమలో విజయం సాధించాలంటే కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్‌తో పాటు నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్- లెర్నింగ్, డెవలప్మెంట్, మొవేట్ చెన్నై కంపెనీకి చెందిన ఎమెల్డా బానుమతి అన్నారు. మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ నందు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం వారు జాతీయ స్థాయిలో టెక్నికల్ సింపోసియం జిమాక్స్-2కే26 కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినారు. ఆమె మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా దిగ్గజ టెక్ కంపెనీలతో పాటు చిన్న సంస్థలు సైతం నూతన టెక్నాలజీలో మెరుగైన పరిశోధనలతో నూతన ఆవిష్కరణలను చేస్తున్నాయని విద్యార్థులు వాటిపై దృష్టి పెట్టాలని సూచనలు చేశారు. ముఖ్యంగా జనరేటివ్ ఏఐ వంటి ఆధునిక సాంకేతికతలను అందిపుచ్చుకోవాలని తెలిపారు. నేటి ప్రపంచంలో వేగవంతమైన పురోగతి వెనుక సాంకేతికతలో ఆవిష్కరణలు, పరిశ్రమలను విప్లవాత్మకంగా మార్చడం, ప్రపంచ సవాళ్లను పరిష్కరించడం మొదలైనవి సాంకేతిక ఆవిష్కరణ పురోగతికి మూలస్తంభంగా చెప్పుకోవచ్చు అని వ్యాఖ్యానించారు. విద్యార్థులు నూతన సాంకేతికతపై అవగాహన పెంచుకోవడం ద్వారా ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్, డీన్-స్కూల్ ఆఫ్ కంప్యూటింగ్ డాక్టర్ చంద్ర ప్రకాష్ గుప్తా, విభాగాధిపతి డాక్టర్ ఎమ్ శ్రీదేవి, కోఆర్డినేటర్ డాక్టర్ డిజె ఆష్విం పబి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## యోగ విద్యతో ఆరోగ్య విప్లవం



**పీలేరు, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సమాజంలో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించ డానికి యోగ విద్య అత్యంత ప్రభావవంతమైన మార్గమని సొసైటీ ఫర్ హ్యూమన్ ఎంపవర్‌మెంట్ అధ్యక్షురాలు డా.పి.వి.ఎస్. లక్ష్మి పేర్కొన్నారు. యోగాను శాస్త్రీయ పద్ధతిలో అందించేందుకు వివేకానంద యోగ అనుసంధాన సంస్థానం, బెంగళూరు అనుబంధంగా "యోగ ఇన్‌స్ట్రక్టర్స్ కోర్స్ " శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ కోర్సు 300 గంటల వ్యవధిలో నిర్వహించబడుతుందని, ఇందులో సిద్ధాంతంతో పాటు ప్రాయోగిక శిక్షణను సమగ్రంగా అందిస్తామని తెలిపారు. అనుభవజ్ఞులైన సర్టిఫైడ్ యోగా మాస్టర్ల ద్వారా శిక్షణ అందించబడుతుందని చెప్పారు. కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన వారికి VYASA, బెంగళూరు నుండి ధృవపత్రం అందజేయబడుతుందని, ఈ సర్టిఫికేట్ యోగా సర్టిఫికేట్ బోర్డు , ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గుర్తింపు పొందినదని వివరించారు. దీని ద్వారా యోగ ఉపాధ్యాయులుగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. వారాంతపు తరగతుల రూపంలో నిర్వహించబడే ఈ శిక్షణలో చేరదలచిన వారు త్వరగా నమోదు చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు 9948244442, 9059676789 నంబర్లకు సంప్రదించాలని సూచించారు. యోగా ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడం, ప్రతి కుటుంబానికి యోగను చేరవేయడం తమ ప్రధాన లక్ష్యమని డా. పి.వి.ఎస్. లక్ష్మి స్పష్టం చేశారు.

## సీతా సమేత శ్రీరామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



**కడప,ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీ సీతా సమేత రామ, లక్ష్మణ, వీరాంజనేయ స్వామి నూతన దేవస్థానాన్ని గురువారం శాస్త్రోకంగా పురోహితులు నగరం లోని 48వ డివిజన్, బేడ, బుడగ జంగం కాలనీలో ప్రారంభించారు. ప్రధాన అర్చకు లు మురళి స్వామి, మరో నలుగురు పౌరోహితులు వేద మంత్రోచ్చారణ మధ్య రామాలయంలో ప్రత్యేక పూజలు చేసి ప్రాణ ప్రతిష్ఠ చేశారు. గురువారం ఉదయం 6 గంటల నుంచి 7.10 నిమిషాల వరకు శ్రీ సీతా సమేత శ్రీరామచంద్ర స్వామి, లక్ష్మణ స్వామి, ఆంజనేయ స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బేడ బుడగ జంగం కుల పెద్దలు ధూపం రాజు, డి శ్రీరాములు, సి.రాముడు, సి.పెంటయ్య, పి.అంజిల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఆద్యంతం వైభవంగా నిర్వహించారు. బుడగ జంగం కాలనీ పరిసరాలను సుందరంగా ముస్తాబు చేశారు. కాషాయ జెండాలను కాలనీలో అలంకరించారు. కలశ ఉద్యాసన, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం, వేద ఆశీర్వచనం కార్యక్రమాలను పురోహితులు నిర్వహించారు. ఉదయం 10.30 నిమిషాలకు శ్రీ సీతారామచంద్ర కళ్యాణ మహోత్సవ ఘట్టం కన్నుల పండుగ పురోహితులు జరిపించారు. ఆలయ పరిసరాలు రామనామంతో మారుమోగాయి. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం బేడ బుడగ జంగం కాలనీలో మెరవణి కార్యక్రమం వైభవంగా కొనసాగింది. కార్యక్రమంలో బేడ బుడగ జంగం కాలనీకి చెందిన పెద్దలు పీ.శ్రీను, కె.చిన రాముడు, డి.దస్తగిరి, కె.లక్ష్మమయ్య, కె.మాంతయ్య పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి: ఎన్‌డి విజయ జ్యోతి



**కడప, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేస్తే రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ జాతీయ కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎన్‌డి విజయ జ్యోతి అన్నారు. గురువారం నగరం లోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో విజయ జ్యోతి డివిజన్ ఇన్‌చార్జిలతో మాట్లాడారు. రాబోయే కడప కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మంచి విజయావకాశాలు ఉన్నాయని ఆశాభావం వ్యక్తంచేశారు.పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేస్తే గెలుపు సాధ్యమని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. ఇంటి ఇంటికి వెళ్లి పరిశీలించి, సమస్యలను గుర్తించి సరిదిద్దాలని ఆమె సూచించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని తెలిపారు. కడప అసెంబ్లీ కోఆర్డినేటర్ బండి జకరయ్య మాట్లాడుతూ, ప్రతి డివిజన్‌లో ఉన్న సమస్యలపై సానుకూల దృష్టితో పనిచేయాలని, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఇన్‌చార్జిలకు సూచించారు. టిడిపి, వైఎస్సార్‌సీపీ పార్టీల వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిరాజుద్దీన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్, నందిమండలం సుశీల్ కుమార్, ఆర్టీఐ రాష్ట్ర అధ్యక్షుడు కొటపాటి లక్ష్మయ్య, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్ల బాబు, డివిజన్ ఇన్‌చార్జిలు ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## పద్య కవులకు ఆహ్వానం



**కడప,ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విశ్వకవి వేమన, తొలి స్వాతంత్ర్య పోరాట వీరుడు ఉయ్యాలవాడ నరసిం హారెడ్డి, దానకర్ణుడుగా పేరుపొం దిన బుడ్డా వెంగళరెడ్డి-ఈ ముగ్గురు మహనీయులపై ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘాల సమాఖ్య ఆధ్వ ర్యంలో, వైయస్సార్ జిల్లా రచయితల సంఘం పర్యవేక్షణలో పద్య కావ్య రచన పోటీ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, ఏపి రెడ్డి సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి ప్రకటిం చారు. గురువారం కడప రెడ్డి సేవా సమితి సభా భవనంలో వారు కరపత్రాలను ఆవిష్కరించా రు.అనంతరం మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా, ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి ఉన్న తెలుగు కవులు పోటీలో పాల్గొని బహుమతులు గెలుచుకునే అవకాశం ఉందని చెప్పారు. ఈ ముగ్గురిలో ఒకరిని ఎన్నుకొని పద్య రచన చేయవలసి ఉంటుందని చెప్పారు. కావ్యాన్ని 300 పద్యాలకు తగ్గకుండా మూడు ఆశ్వాసాలతో చిత్రించాలని, కావ్యం వస్తు సమగ్రత, శిల్ప పరిణతి కలిగి, మహా కావ్య లక్షణాలతో విలసిల్లాలని, కావ్యంలో సామాజిక స్వభావం ప్రతిబిం బించాలని సూచించారు. వర్తమాన సమాజానికి స్ఫూర్తిదాయకంగా ఉండాలని అన్నారు. లెక్కల కొండారెడ్డి ప్రసంగిస్తూ ఈ పోటీలో మూడు నగదు పురస్కారాలు ఉంటాయని, వేమనపై రాసిన కావ్యాల్లో ఒకటి, ఉయ్యాలవాడ నరసింహారెడ్డిపై రాసిన కావ్యాల్లో మరొకటి, బుడ్డా వెంగళరెడ్డి పై రాసిన కావ్యాల్లో ఇంకొకటి ఎంపిక చేయబడుతుందని చెప్పారు. పోటీలో పాల్గొను వారు వ్రాత ప్రతిని గాని, టైపు చేసిన ప్రతి ప్రింటవుట్‌ను గాని 2026 జూలై 15 లోపల రెడ్డి సేవా సమితి, 1/80-14 రాజీవ్ మార్గ్, యర్రముక్కపల్లి, కడప అడ్రస్‌కు పంపాలని, సంప్రదింపులకు 7700003399 సంప్రదించాలన్నారు.



# అన్నమయ్య జిల్లా

## అమరావతికి రాజధాని హోదాపై హర్షం



**పీలేరు,ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్ర రాజధానిగా అమరావతిని శాసనసభలో ఏకగ్రీవంగా తీర్మానం చేయడంతో పాటు, భారత పార్లమెంట్ ఉభయ సభల్లోనూ ఆమోదం లభించిన సందర్భంగా పీలేరు సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు కలిసి అమరావతి పేరుతో కేక్ కట్ చేసి తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటివరకు రాష్ట్ర రాజధాని విషయంలో అయోమయానికి గురైన ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇకపై తమ రాజధాని అమరావతి అని గర్వంగా చెప్పుకోవచ్చని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అదేవిధంగా, ప్రిన్సిపల్ విద్యార్థులకు అమరావతి నగరపు చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యతను వివరించి, దాని గొప్పతనాన్ని తెలియజేశారు.

## అట్రాసిటీ కేసుల్లో బాధితులకు న్యాయం కోసం చర్యలు తీసుకుంటాం: చిన్న రాముడు

**పీలేరు,ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్ర ఎస్సీ కమిషన్ కార్యదర్శి చిన్న రాముడును పీలేరుకు చెందిన ఏపీ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీల రాష్ట్ర అధ్యక్షుడు పాలకుంట శ్రీనివాసులు ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి బొకే అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై చర్చ జరిగింది. ముఖ్యంగా రాష్ట్రంలో అట్రాసిటీ కేసుల్లో స్టేషన్ బెయిల్ 41 నోటీసును రద్దు చేయాలని, అలాగే అనేక జిల్లాల్లో ఎస్సీ, ఎస్టీ కేసుల బాధితులకు నష్టపరిహారం సకాలంలో అందడం లేదని శ్రీనివాసులు వివరించారు. దీనిపై స్పందించిన చిన్న రాముడు సమస్యలను త్వరలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు శ్రీనివాసులు తెలిపారు.

## ఘనంగా హర్ష టయోటా షోరూం ప్రారంభం

**- వినియోగదారులకు సేవలతో పాటు పలువురుకి ఉపాధి: ఎమ్మెల్యే**



**మదనపల్లె, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పుంగనూరు రోడ్డు మునిసిపల్ బోర్డు వద్ద హర్ష టయోటా షోరూంను గురువారం ఘనంగా ప్రారంబించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే షాజహాన్ భాష, బిజెపి సీనియర్ నాయకులు చల్లపల్లి నరసింహా రెడ్డి, విజయభారతి విద్యా సంస్థ చైర్మన్ డాక్టర్. ఎన్,సేతులు హాజరు కాగా ఎమ్మెల్యే షో రూమ్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అలాగే షోరూం ప్రాధాన్యతలను చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సాయికుమార్, సీఈవో దేవ్ సేనా పతి, ఎస్జీఎం సాయిబాబా ముఖేష్, సేల్స్ జిఎం శివకోటిలు అతిధులకు షోరూంలో లభించే సేవలు, వినియోగదారులతో సంబంధాలు, డీలర్ షిప్ ప్రస్థానం, అత్యుత్తమ సేవా ప్రమాణాలు గురించి సమగ్రంగా వివరించారు. అనంతరం ఎమ్మెల్యే షాజహాన్ భాష మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో మొదటిగా హర్ష టయోటా షోరూం ప్రారంభించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు బెంగళూరు, తిరుపతికి పరిమిత మైన షోరూం సేవలు మదనపల్లె, జిల్లా వాసులకు అందు బాటులో రావడాన్ని ఆహ్వానించారు. చల్లపల్లి నరసింహారెడ్డి మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన మదనపల్లెలో పెద్ద షోరూం వినియోగ దారులకు అందు బాటులోకి రావడం అభివృద్ధికి నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో షోరూం సిబ్బంది, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

## 'ఆదిత్య'లో ఎర్గోనామిక్ చిట్కాలపై అవగాహన

**- హాజరైన స్వాస్థ్య ఆసుపత్రి ఫిజియోథెరపిస్ట్ చంద్రశేఖర్**



**మదనపల్లె, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విద్యార్థుల్లో శారీరక ఆరోగ్యం, సరైన కూర్చునే విధానం, కంప్యూటర్ వినియోగ సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఎన్.ఎస్.ఎస్. యూనిట్ ఆధ్వర్యంలో ఎర్గోనామిక్ చిట్కాలు అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి స్వాస్థ్య ఆసుపత్రికి చెందిన ఫిజియోథెరపిస్టు డాక్టర్ చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజువారీ చదువులు, ల్యాప్‌టాప్/మొబైల్ వినియోగం వల్ల వచ్చే మెడ,నడుము నొప్పులు, కంటి సమస్యలను నివారించడానికి సరైన కూర్చునే విధానం, శరీర భంగిమ (పోష్చర్), తరచుగా విరామాలు తీసుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. అలాగే చిన్న చిన్న వ్యాయామాలు చేయడం ద్వారా శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని తెలిపారు. అనంతరం కళాశాల డైరెక్టర్ ఎస్.రామలింగా రెడ్డి, ప్రిన్సిపల్ పి.రాయుడు సభను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా సమానంగా శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అరుణ్ కుమార్ రెడ్డి, డి.శ్రీనివాసులు రెడ్డి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


## అమరావతి చట్టబద్ధత ఆమోదంపై జనసేన సంబరాలు



**మదనపల్లె, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజా రాజధాని అమరావతికి చట్టబద్దతపై ఉభయ సభలలో ఆమోదం లభించిన నేపథ్యంలో జనసేన పార్టీ రాయలసీమ కో- కన్వీనర్ గంగారపు రామదాస్ చౌదరి, ఏఎంసీ చైర్మన్ జంగాల శివరామ్, సీనియర్ నాయకులు ఎంఎన్.చంద్రశేఖర్ రెడ్డి ఆద్వర్యంలో దీపాలు వెలిగించి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రదాన మంత్రి నరేంద్ర మోదీ, సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ లకు కృతజ్ఞతలు తెలుపుతూ, చారిత్రాత్మక విజయం లభించిందని అభినందనలు తెలిపారు. దేశంలోని 40 రాజకీయ పార్టీలు ఉభయ సభలలో అమరావతి రాజధానిగా సంపూర్ణ మద్దతు ఇచ్చి ఆంధ్రప్రదేశ్ ప్రజల అభిమానం చూరగొన్నాయన్నారు. పార్లమెంట్, రాజ్యసభ ఉభయ సభలలో ఆమోదం పొందిన నేపథ్యంలో భారతదేశ వ్యాప్తంగా ఉన్న తెలుగువారు నేడు దీపాలు వెలిగించి సంబరాలు చేసుకోవడం చరిత్రాత్మకం అన్నారు. పాలన చేతకాదు, అసెంబ్లీలో అడుగు పెట్టనివ్వం అన్నావారికి చెంపదెబ్బ లాగా నేడు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ తన శాఖలో ఐదు జాతీయ అవార్డులను పొంది దేశంలోనే బెస్ట్ అనిపించుకున్నారని అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# వారణాసి ఇప్పుడెందుకు గుర్తుకు వస్తోంది




రామాయణ పార్ట్ 1 టీజర్ వచ్చాక సోషల్ మీడియాలో పెద్ద చర్చ జరుగుతోంది. ముంబైలో దీని స్పెషల్ ప్రీమియర్ చూసిన మీడియా ప్రతినిధులు ఓ రేంజ్ లో ఎలివేషన్లు ఇచ్చాక అంచనాలు పెరిగిపోయాయి. వాటిని దృష్టిలో పెట్టుకుని చూసిన చాలా మంది నాలుగు వేల కోట్ల స్థాయిలో బొమ్మ కనిపించలేదని పెదవి విరుస్తున్న వైనం ఎక్స్, ఇన్స్ టాలో గమనించవచ్చు. కొన్ని విజువల్స్ ఎక్స్ ట్రాడినరిగా ఉంటే మరికొన్ని టీవీ సీరియల్ తరహాలో ఉన్నాయనే కామెంట్స్ వినిపించాయి. ఫైనల్ అవుట్ పుట్ ఇలాగే ఉంటుందని చెప్పలేం కానీ రిలీజ్ నాటికీ క్వాలిటీలో ఖచ్చితంగా మార్పు ఉంటుంది. ఇదిలా ఉండగా ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మహేష్ బాబు వారణాసి ప్రస్తావన తెస్తున్నారు కొందరు నెటిజెన్లు. గత ఏడాది హైదరాబాద్ లో లాంచ్ చేసిన టైటిల్ కాన్సెప్ట్ వీడియోని మళ్ళీ షేర్ చేస్తున్నారు. కథలో ఉద్దేశాన్ని, రాజమౌళి ప్రెజెంట్ చేసిన తీరుని ఉదహరిస్తూ జక్కన్నకు సాటివచ్చే వాళ్ళు ఎవరూ లేరంటూ కితాబుల వర్షం కురిపిస్తున్నారు. ఇక్కడ పోలిక సబబని చెప్పలేం కానీ రామాయణ టీమ్ గుర్తుపెట్టుకోవాల్సిన విషయాలు కొన్ని ఉన్నాయి. రామాయణ రెగ్యులర్ మూవీ కాదు. భారతీయులకు ఒక ఎమోషన్. రాముడి కథను కొన్ని వందల వేలసార్లు చూసినా మళ్ళీ చూసేందుకు సిద్ధంగా ఉంటారు. అలాంటప్పుడు ఇంత పెద్ద క్యాస్టింగ్ ఉన్న గ్రాండియర్ నుంచి విపరీతంగా ఎక్స్ పెక్ట్ చేయడం సహజం. వావ్ అనిపించాల్సిందే. జస్ట్ బాగుందనే మాట సరిపోదు. దానికోసం ఎంత కష్టమైనా పడాల్సిందే. ప్రపంచవ్యాప్తంగా కొన్ని వేలమంది ఈ ప్రాజెక్టు మీద పని చేస్తున్నారు. భవిష్యత్తులో ప్రతి ఒక్కరికి ల్యాండ్ మూవీగా నిలిచిపోవాలని నిర్మాత నమిత్ మల్హోత్రా కంకణం కట్టుకున్నారు. అయితే ఏఐ టెక్నాలజీ పెరిగిపోతున్న తరుణంలో డిఎన్ఈజి సంస్థ నుంచి జనాలు బెస్ట్ ఆశిస్తున్నారు. ఆ మోతాదు ఏ మాత్రం తగ్గినా ఒప్పుకునే పరిస్థితి లేదు. రెహమాన్, జిమ్మర్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ బాగున్నప్పటికీ ఇంకా హై ఉండాలని మ్యూజిక్ లవర్స్ కోరుతున్నారు. రామాయణ డిస్కషన్ ఇంకెక్కడి దాకా వెళ్తుందో చూడాలి.

## విస్మయపరిచే 'రామ' పరిచయం



బాలీవుడ్ లోనే కాదు భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత ఖరీదయిన సినిమాగా తెరకెక్కుతున్న రామాయణ పార్ట్ 1 టీజర్ ఇవాళ హనుమాన్ జయంతి సందర్భంగా రాముడి పాత్ర పరిచయంతో విడుదల చేశారు. కథగా చెప్పేందుకు కొత్త విషయం లేదు కానీ విజువల్స్ తోనే తమ విజన్ ఏ స్థాయిలో ఉందో చూపెట్టేందుకు ప్రయత్నించారు దర్శకులు నితేష్ తివారి, నిర్మాత నమిత్ మల్హోత్రా. కేవలం రాముడిని చూపించే కాన్సెప్ట్ కాబట్టి ఇతర ఆర్టిస్టులను రివీల్ చేయలేదు. ప్రపంచంలోనే అత్యున్నత విఎఫ్ఎక్స్ కంపెనీల్లో ఒకటైన డిఎన్ఈజి ఈ రామాయణలో భాగస్వామ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే. 8 ఆస్కార్ అవార్డులు దక్కించుకున్న ఈ సంస్థ ఎప్పుడూ చూడని గ్రాఫిక్స్ ని ఈ ఎపిక్ డ్రామాలో చూపించబోతున్నట్టు ఇన్ సైడ్ టాక్. ఇక వీడియో విషయానికి వస్తే ఏఆర్ రెహమాన్, జిమ్స్ హ్యామర్ నేపధ్య సంగీతంలో ప్రతి క్షణం ఎలివేట్ అయ్యే స్థాయిలో అబ్బురపరిచే దృశ్యాలు రెండు నిమిషాల ముప్పై ఎనిమిది సెకండ్లు కట్టిపడేస్తాయి. నాలుగు వేల కోట్ల బడ్జెట్ అంటున్నారు కాబట్టి ఆ స్థాయిలో అనిపించాయా అంటే వెంటనే సమాధానం చెప్పడం కష్టం. ఎందుకంటే ఇది కేవలం శాంపిల్ మాత్రమే. రుచి చెప్పడానికి ఒక్క మెతుకు సరిపోతుంది కానీ ఇలాంటి కంటెంట్ విషయంలో తొందరపడి ఎలాంటి జడ్జ్ మెంట్లు ఇవ్వలేం. పైగా రిలీజ్ ఇంకా చాలా దూరం ఉంది కాబట్టి పరిమితంగా సీన్స్ చూపించాలన్న ఉద్దేశంతో కట్ చేసిన విధానం ఎన్నో విషయాలను దాచి పెట్టిందన్నది వాస్తవం. డేట్ ఇంకా నిర్ధారణగా చెప్పకపోయినా ఇదే సంవత్సరం దీపావళికి విడుదల కావడం పక్కా. మరోసారి దాన్ని టీజర్ లో నొక్కి చెప్పారు. సాయిపల్లవి సీతగా, యాష్ రావణుడిగా, సన్నీ డియోల్ హనుమంతుడిగా నటిస్తున్న రామాయణ ఇకపై ఎవరూ ఇంత గొప్పగా రామకథను చెప్పలేరన్న రీతిలో నితేశ్ తివారి తెరకెక్కిస్తున్నట్టు ఇన్ సైడ్ టాక్. ఈ స్థాయి అంచనాలను నిలబెట్టుకోగలిగితే వరల్డ్ వైడ్ వసూళ్లతో పెట్టిన పెట్టుబడి రికవరీ చేసుకోవచ్చు. అదే జరిగితే కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టినట్టే.

# శుభసూచకం... ప్రీమియర్లు ఫుల్




వేసవి సీజన్లో కొంచెం ముందుగానే రేసులోకి దిగింది 'ఉస్తాద్ భగత్ సింగ్'. కానీ ఈ చిత్రం టాలీవుడ్‌కు శుభారంభాన్ని అందించలేకపోయింది. ఆరంభ మెరుపుల తర్వాత ఆ సినిమా చల్లబడిపోయింది. తర్వాతి వారం వచ్చిన సినిమాలు ఏమాత్రం ప్రభావం చూపలేకపోయాయి. కానీ ఈ వారం రాబోయే రెండు సినిమాలు మాత్రం ప్రేక్షకుల్లో బాగానే ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. శర్వానంద్ మోటార్ స్పోర్ట్స్ మూవీ 'బైకర్'తో పాటు.. సంగీత్ శోభన్ హీరోగా నటించిన ఫాంటసీ ఎంటర్టైనర్ 'రాకాస' ఈ శుక్రవారం బాక్సాఫీస్ బరిలో నిలిచాయి ఈ రెండు చిత్రాల మీద ఎంతో నమ్మకంగా ఉన్న మేకర్స్ ఒక రోజు ముందే పెయిడ్ ప్రిమియర్స్ ప్లాన్ చేశారు. హైదరాబాద్‌లో ఈ రెండు చిత్రాలకు రెండంకెల సంఖ్యలో షోలు పడుతున్నాయి. ముందు రెండు చిత్రాలకూ పరిమిత థియేటర్లలో కొన్ని షోలు వేయాలి అనుకున్నారు. కానీ బుకింగ్స్ ఓపెన్ అయ్యాక ఆ షోలకు వచ్చిన రెస్పాన్స్ చూశాక.. షోలు పెరుగుతూ వెళ్లాయి. 'బైకర్' మూవీకి ముందు ప్రిమియర్ మల్టీప్లెక్స్ థియేటర్లలో మాత్రమే షోలు మొదలుపెట్టి.. ఆ తర్వాత వేరే మల్టీప్లెక్సులు, సింగిల్ స్క్రీన్లలో కూడా షోలు ఓపెన్ చేశారు. ఈ చిత్రానికి 30కి పైగానే ప్రిమియర్ షోలు పడుతున్నాయి హైదరాబాద్‌లో. మెజారిటీ షోలు సోల్డ్ ఔట్ దిశగా వెళ్తున్నాయి. ఇక 'బైకర్'తో పోలిస్తే 'రాకాస' చిన్న సినిమా అయినా.. దానికి కూడా పెద్ద సంఖ్యలోనే ప్రిమియర్లు పడుతున్నాయి. ఒక్కో మల్టీప్లెక్సులో రెండు మూడు షోలు వేస్తున్నారు. కొన్ని సింగిల్ స్క్రీన్లలో కూడా షోలు పడుతున్నాయి. దానికి హైదరాబాద్‌లో షోల సంఖ్య 30 దాటిపోయింది. చాలా షోలు ఫుల్ అయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఈ రెండు చిత్రాలకూ ఏపీలో వైజాగ్, విజయవాడల్లోనూ ప్రిమియర్స్ వేస్తున్నారు. వాటికీ రెస్పాన్స్ బాగుంది. మొత్తానికి ప్రిమియర్స్ బుకింగ్స్ చూస్తుంటే ఎంతో ఆశాజనకంగా ఉంది. రెండూ బలమైన కంటెంట్ ఉన్న సినిమాల్లానే కనిపిస్తున్నాయి. ప్రిమియర్స్ నుంచి పాజిటివ్ టాక్ వస్తే.. శుక్రవారం రెండు చిత్రాలకూ మంచి ఓపెనింగ్స్ ఆశించవచ్చు. వీకెండ్లో థియేటర్లు కళకళలాడొచ్చు.



# బిజినెస్ న్యూస్




## మైనస్ 1526 పాయింట్ల నుంచి 185 -లోకి సెన్సెక్స్



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఉదయం భారీ నష్టాల్లో ట్రేడైన సూచీలు.. ఆఖర్లో కోలుకుని లాభాల్లో ముగిశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ బలోపేతం కావడం, అన్ని రంగాల్లో ఎంపిక చేసిన స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కారణంగా సూచీలు రాణించాయి. ఇంట్రాడేలో 1526 పాయింట్ల నష్టం నుంచి సెన్సెక్స్ కోలుకోవడం గమనార్హం. సెన్సెక్స్ ఉదయం 72,262.05 పాయింట్ల (క్రితం ముగింపు 73,134.32) వద్ద భారీ నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 71,545.81 వద్ద కనిష్ఠాన్ని తాకింది. మధ్యాహ్నం తర్వాత క్రమంగా కోలుకున్న సూచీ.. చివరకి 185.23 పాయింట్ల లాభంతో 73,319 వద్ద ముగిసింది. నిఫ్టీ 33.70 పాయింట్ల లాభంతో 22,713 పాయింట్ల వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 157 పైసలు కోలుకుని 93.13గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్టాక్స్ లాభాల్లో ముగిశాయి. ఏషియన్ పెయింట్స్, ఎటర్నల్, సన్‌ఫార్మా, ఎన్టీపీసీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 108 డాలర్లు, బంగారం ఔన్సు 4616 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## లక్ష్యం దాటిన పరోక్ష పన్ను వసూళ్లు.. ఆ ఒక్కటీ మిస్



దేశంలో పరోక్ష పన్ను వసూళ్లు లక్ష్యాన్ని దాటాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం రూ.15.52 లక్షల కోట్ల మేర పరోక్ష పన్నుల వసూళ్లను లక్ష్యంగా పెట్టుకోగా.. వాస్తవ వసూళ్లు ఆ అంచనాలను మించాయని ప్రభుత్వవర్గాలు గురువారం వెల్లడించాయి. కస్టమ్స్, ఎక్సైజ్, జీఎస్టీ కలిపి సవరించిన అంచనాలు రూ.15.52 లక్షల కోట్లు దాటినట్లు పేర్కొన్నాయి. వాస్తవంగా ఎంత మొత్తం వచ్చిందనే వివరాలు వెల్లడించకుండా.. ఏ పన్ను రూపంలో ఎంత శాతం పన్ను వసూలైందనే వివరాలను అధికారులు వెల్లడించారు. కస్టమ్స్ డ్యూటీ అంచనాలతో పోలిస్తే 102 శాతం వసూలైందని, ఎక్సైజ్ డ్యూటీ 101 శాతం, సీజీఎస్టీ 100.8% వసూలైందని అధికార వర్గాలు వెల్లడించాయి. మొత్తంగా జీఎస్టీ, ఇతర పన్నులు కలిపి పరోక్ష పన్ను వసూళ్లు 101.2 శాతంగా ఉన్నట్లు తెలిపాయి. మిగిలిన అన్ని పన్నులూ లక్ష్యాన్ని చేరుకున్నప్పటికీ.. ఒక్క పాన్ మసాలాపై విధించిన హెల్త్, నేషనల్ సెక్యూరిటీ సెస్సు మాత్రం అంచనాలను అందుకోలేకపోయింది. 40 శాతం జీఎస్టీ రేటుకు అదనంగా ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచి ఈ ప్రత్యేక సెస్సును కేంద్రం వసూలు చేస్తోంది. ఈ సెస్సు రూపంలో రూ.2,330 కోట్లు వస్తాయని ప్రభుత్వం భావించగా.. కేవలం 63 శాతం మాత్రమే లక్ష్యాన్ని చేరుకుంది. కొత్తగా ప్రవేశపెట్టిన పన్ను కావడం వల్ల ఈ తగ్గుదల ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఈ సెస్సు రూపంలో రూ.14 వేల కోట్లు రాబట్టాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## రోడ్‌స్టర్ ధరను రూ.60 వేలు తగ్గించిన ఓలా ఎలక్ట్రిక్



ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ తన ప్రీమియం మోటార్ సైకిల్ రోడ్‌స్టర్ ఎం 9.1ఎ౫ప్త ధరను భారీగా తగ్గించింది. 4680 భారత్‌సెల్‌పై రూపొందిన ఈ బైక్ ధరను ఏకంగా రూ.60 వేలు తగ్గిస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది. ప్రస్తుతం దీని ధర రూ.1,89,999 ఉండగా.. రూ.1,29,999కు తగ్గిస్తున్నట్లు వెల్లడించింది. ఓలా తన గిగా ఫ్యాక్టరీలో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన బ్యాటరీ సెల్ (4680 భారత్ సెల్‌ను) ఈ మోటార్ సైకిల్‌లో వినియోగించింది. ఈ సెల్ తయారీ వేగవంతం చేసిన నేపథ్యంలో దీని ధరలు తగ్గుముఖం పట్టాయని తెలిపింది. ఈ ప్రయోజనాన్ని వినియోగదారులకు బదిలీ చేయడంలో భాగంగా రోడ్‌స్టర్ మోటార్ సైకిల్ ధరను భారీగా తగ్గిస్తున్నట్లు వెల్లడించింది. అయితే, ఈ మోటార్ సైకిల్‌ను లిమిటెడ్ టైమ్ విండోలో మాత్రమే కొనుగోలుకు అనుమతిస్తారు. ఏప్రిల్ 3న సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు కొనుగోలు విండోను తెరవనున్నట్లు ఓలా ప్రతినిధి తెలిపారు. రోడ్‌స్టర్ అందుబాటును బట్టి ఎప్పటికప్పుడు పర్చేజ్ విండో సమయాలను వెల్లడిస్తామని పేర్కొంది. ఓలా ఎలక్ట్రిక్ రోడ్‌స్టర్ 9.1 ఒకసారి ఛార్జింగ్ చేస్తే 500 కిలోమీటర్లు వరకు ప్రయాణించొచ్చని కంపెనీ చెబుతోంది. ప్రస్తుత #EndICEAge క్యాంపెయిన్‌లో ఈ బైక్‌కు ఐదింతల డిమాండ్ పెరిగిందని ఓలా పేర్కొంది.

## ఆ ఒక్క ప్రశ్నతో మా సంస్థ ఉద్యోగి రాజీనామాను ఆపాను..



అప్పుడప్పుడే భవిష్యత్తుకు బాటలు వేసుకుంటూ ఎదిగే స్టార్టప్‌లకు ప్రతి ఉద్యోగి కీలకమే. ఒక్క ప్రతిభావంతుడు సంస్థను వీడినా.. ఆ స్థానాన్ని భర్తీ చేయడం కష్టమవుతుంది. అలాంటి పరిస్థితే డిజిటల్ క్రియేటివ్స్ సంస్థకు వచ్చింది. కానీ ఆ స్టార్టప్ సీఈఓ ప్రీతీ మాలిక్ అడిగిన ఒక్క ప్రశ్న ఉద్యోగి ఎటూ వెళ్లకుండా ఆపింది ఈ మేరకు ప్రీతి షేర్ చేసిన లింక్డిన్ పోస్టు వైరల్ అవుతోంది. సంస్థ పనితీరుకు సంబంధించిన అంశాలపై ప్రీతీ మాలిక్ ఒక్కో ఉద్యోగితో మాట్లాడాలని సిద్ధమైవచ్చారు. సరిగ్గా అప్పుడే ఒకరు అనూహ్యంగా రాజీనామా లేఖ ఇచ్చారు. అతడు పనిలో ఎంతో చురుగ్గా ఉంటాడని, అలాంటి వ్యక్తిని కోల్పోవడం ఇష్టం లేక ఒక ప్రశ్న వేశానని చెప్పారు. దానిని ఆమె గేమ్ ఛేంజింగ్ ప్రశ్నగా పేర్కొన్నారు. "మీరు వెళ్లిపోవాలనుకుంటు న్నారు కదా..? అసలు మీకు ఎలాంటి రోల్ సరిపోతుందని భావిస్తున్నారు..?అని ప్రశ్నిం చినట్లు చెప్పారు. దాంతో అతడు రాజీనామా వెనక ఉన్న కారణాన్ని చెప్పేశారు. నన్ను ఆటోమేషన్ వర్క్‌కోసం హైర్ చేసుకున్నారు. ఆ పనిని నేను ఆస్వాదిస్తూ చేస్తున్నా. కానీ దాన్నుంచి దృష్టి మళ్లేలా పదేపదే వేర్వేరు పనులు చేయాల్సి రావడం విసుగుపుట్టిస్తోంది ' అని సమాధానం ఇచ్చారు. "అధిక వేతనం కోసం అతడు సంస్థను వీడటం లేదని నాకు అర్థమైంది. తాను చేస్తోన్న పనుల మధ్య పొంతన లేకపోవడం వల్లే ఆ నిర్ణయం తీసుకున్నారు. మేం అప్పగించిన ఆటోమేషన్ పని విషయంలో అతడిపై ఫిర్యాదుల్లేవు. కానీ తర్వాత అతడిపై పడిన విసుగుపుట్టించే పనుల వల్ల.. ఏకాగ్రత కోల్పోయారు. దాంతో అతడు ఆటోమేషన్ మీద దృష్టి సారించేలా చర్యలు తీసుకున్నాం. ఈ వ్యవహారంలో నాకో విషయం అర్థమైంది. జీతం పెంచడం, ప్రోత్సాహకాలు ఇవ్వడం ఒక్కటే ఉద్యోగిని సంస్థలో కొనసాగేలా చేయదు. తాము చేస్తోన్న పని తమ ఎదుగుదలకు ఉపయోగపడుతుందా అని ఉద్యోగికి అనిపించడం కూడా కీలకమని గుర్తించాను. ఆ ఒక్క ప్రశ్న కంపెనీకి, ఆ ఉద్యోగికి మేలు చేసింది" అని తన అనుభవాన్ని వెల్లడించారు.

## ఆంజనేయుడికి పాలాభిషేకం




**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీకాళహస్తీశ్వ రాలయ ఆవరణలో ఉన్న 16 కాళ్ల మండపం వద్ద ఉన్న ఆంజనేయ స్వామికి హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు ఏకాంతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా వీరాంజనేయ స్వామివారికి మంత్రోచ్ఛా రణల మహాపూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉన్న హనుమాన్ కు మేళతాళాల మధ్య వేద మంత్రాలతో పాలభిషేకం, చందనాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా హనుమాన్ భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. దీంతో ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ అర్చకులు, వేద పండితులు పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

## భక్తులకు మజ్జిగ పంపిణీ



**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం నందు క్యూలైన్లో వచ్చే భక్తులకు వేసవికాలం దృష్టిలో ఉంచుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు గురువారం నుంచి క్యూలైన్లో వచ్చే భక్తులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పరచుకున్న పచ్చదనం



**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పచ్చదనపు అందాలతో ఆ మార్గం ఎంతో కనువిందు చేస్తోంది. పట్టణం నుంచి వేడాంకు వెళ్లే మార్గంలో భారీ వృక్ష సంపద ప్రయాణికులకు అహ్లాదకర ప్రయాణాన్ని ఇస్తోంది ఇక్కడి రోడ్డుకు ఇరువైపులా భారీ వృక్షాలు ఏళ్ల తరబడి ఉన్నాయి. ప్రస్తుతం ఎండ తీవ్రతకు ఇటువైపుగా రాకపోకలు సాగించే వాహనాచకులు, పాదచారులు కాస్త సమయం ఈ చెట్ల కింద ఎంతో హాయిగా సేద తీరుతున్నారు. పచ్చదనాన్ని పంచడమే కాకుండా మనసుకు ఎంతో ఉల్లాసాన్ని కలిగిస్తుండటం విశేషం.

## జగన్ జరాసంధుడుగా పేరు మార్చుకోవాలి

### - టిటిడి బోర్డు మాజీ సభ్యులు ఓ విరమణ

**తిరుపతి, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజధాని అమరావతిని మావిగన్‌గా మార్చాలని చెప్పిన జగన్ ముందు తన పేరును రాక్షసుల సమూహానికి గురువైన జరాసంధుడిగా మార్చుకోవాలని టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు ఓవి రమణ విమర్శించారు. గురువారం తిరుపతి లో ని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవతల రాజధాని అయిన అమరావతి పేరుతో మన అందమైన గొప్ప రాజధాని నిర్మాణానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్ర అభివృద్ధిని కాంక్షించి రాజధాని నిర్మిస్తుంటే రాక్షసులు అడ్డుపడుతు న్నారని ఆరోపించారు. అయితే రాక్షసుల సమూహం కి నాయకుడిగా మారిన జగన్ మోహన్ రెడ్డి జరాసంధుడిగా తయారయ్యాడని ఆరోపించారు. జరాసంధుడు అంటే జగన్మోహన్, రామచంద్ర రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, ధనంజయ రెడ్డిల సమూహమేనని వివరించారు. రాక్షసుల గుంపుతో దేవతల రాజధాని అమరావతి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోరాడుతున్నారని అన్నారు. దేవ దానవులు మందర పర్వతాన్ని కవ్వంగా చేసుకొని వాసుకి సర్పాన్ని తాడుగా చేసుకుని పాల సముద్రాన్ని చిలికితే వచ్చే విషయాన్ని గర్లకంఠుడైన శివుడు తన కంఠంలో దాచుకొని ప్రజలను కాపాడినట్లు, అమృతాన్ని దేవతలకు పంచినట్లు రాష్ట్ర ప్రజలకు అమరావతి రాజధాని ఇచ్చి అమృత ఘడియలు తీసుకువచ్చే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో దూర దృష్టితో కృత నిత్యంతో, చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని అన్నారు. రాక్షసులతో జరిగే పోరాటంలో చివరకు గెలిచేది దేవతలేనని చంద్రబాబు నాయుడు పోరాటం కూడా విజయం సాధిస్తుందని పేర్కొన్నారు. అమరావతిని రాజధానిగా చేస్తూ రాజ్యాంగబద్ధంగా చట్టం చేస్తే దాన్ని తప్పు పట్టిన జగన్ రాజ ద్రోహానికి పాల్పడినట్లేనని అతనిపై రాజ ద్రోహం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.




## దక్షిణామూర్తికి విశేష అభిషేకాలు



**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ముక్కంటి ఆలయంలో కొలువుదీరిన శ్రీ దక్షిణామూర్తికి విశేష పూజలు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం స్వామివారి సన్నిధి వద్ద కలశాన్ని ఏర్పాటుచేసి సంకల్ప పూజలు నిర్వహించారు. గోక్షీరంతో పాటు విశేష పూజ ద్రవ్యాలతో అభిషేకాలు జరిపారు. విశేష అలంకరణలు పూర్తయ్యాక ధూప దీప నివేదనలు సమర్పించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

## శాశ్వత రాజధానిగా అమరావతి

### -తిరుపతి జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో ఘనంగా సంబరాలు



**తిరుపతి,ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి శాశ్వత రాజధానిగా అమరావతిని పార్లమెంటు ఉభయ సభలు ఆమోదించిన శుభ సందర్భంగా, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్,జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో ఘనంగా సంబరాలు నిర్వహించారు. తిరుపతి జిల్లా మంగళం ట్రెండ్స్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి, విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అమరావతి రాజధాని ప్రాముఖ్యతపై ప్రసంగాలు చేసి, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. డీఈఓ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, అమరావతి రాష్ట్ర అభివృద్ధికి దిక్సూచి గా నిలుస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు సమాజం, రాష్ట్ర అభివృద్ధి పట్ల అవగాహన పెంపొందించుకొని, భవిష్యత్‌లో దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అమరావతి రాజధాని చరిత్రలో నిలిచిపోతుంది

### -టిడిపి రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ

**తిరుపతి,ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అమరావతి రాజధాని అజరామరంగా చరిత్రలో నిలుస్తుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ తెలియజేశారు. గురువారం స్థానిక బైరాగిపట్టిడ లోని అన్న క్యాంటీన్ వద్ద టపాకాయలు పేల్చి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలోతెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు టపాకాయలుకాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ వర్మ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని భారత పార్లమెంట్లో ఆమోదించడం శుభ పరిణామామం అని ఆనందాన్ని వ్యక్తం చేశారు. రాజధానికి భూములు ఇచ్చిన రైతుల త్యాగాలు చరిత్రలో సువర్ణ అక్షరాలతో నిలిచిపోతాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు ధన్యవాదాలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు కలలు కన్న రాజధాని అమరావతికి పార్లమెంటులో చట్టపద్ధత కల్పిస్తూ బిల్లు పాస్ అవడం పట్ల రాష్ట్ర వ్యాప్తంగా పండగ వాతావరణం కనిపిస్తోందన్నారు. ఇది అన్ని మతాలు కులాలు వర్గాలకు చెందిన సార్వజనిక రాజధాని అని పేర్కొన్నారు. రాజధాని అమరావతి లభించిన చట్టబద్ధత నవ్యాంధ్ర అభివృద్ధిలో ఒక కీలక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. అదేవిధంగా ఏ ప్రాంతం అభివృద్ధి చెందాలన్న రాజధాని ప్రాంతం ముఖ్యమన్నారు అమరావతి అభివృద్ధి చెందితేనే రాష్ట్రంలోని అన్ని వర్గాలకు ఉపాధి వ్యాపార అవకాశాలు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒక రాష్ట్ర రాజధానికి కేంద్రం చట్టబద్రత కల్పించడం దేశంలో ఇదే తొలిసారి అన్నారు. 1953లో తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా చరిత్ర సూచించిన ఆంధ్ర రాష్ట్రం ఇప్పుడు రాజధానికి చట్టబద్రత పొందిన తొలి రాష్ట్రంగా చరిత్ర నిలిచిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రాము, రవి, భారతి యశోద ,హరి ,మోనిష్ యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## రూయాలో ప్రపంచ ఆటిజం దినోత్సవం

### -అవగాహన ర్యాలీ నిర్వహణ



**తిరుపతి,ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా తిరుపతి లోని రూయా ఆసుపత్రిలి ప్రాంగణంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. వి. బాలకృష్ణ నాయక్ విచ్చేశారు. రూయా మెడికల్ సూపరింటెండెంట్ డా. బి. మనోహర్,పెడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ కిరీటి, ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. రెడ్డి ప్రసాద్‌లి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ, ప్రస్తుతం ఆర్‌బిఎస్‌కె-డిఇఐసి ద్వారా 278 మంది ఆటిజం పిల్లలు నమోదు అయ్యారని తెలిపారు. కోవిడ్-19 తరువాత కాలంలో స్క్రీన్ టైమ్ పెరగడం, తల్లిదండ్రులు ఉద్యోగాల్లో ఉండటం వంటి కారణాల వల్ల ఆటిజం కేసులు పెరుగుతున్నాయన్నారు. రూయా ఆసుపత్రి పెడియాట్రిక్స్ విభాగం ఆధ్వర్యంలో డిఇఐసి కేంద్రం ద్వారా పిల్లలకు ఉచితంగా పరీక్షలు, గుర్తింపు, ప్రారంభ దశలో చికిత్స వంటి సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఆటిజం ఉన్న పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సరైన సమయంలో గుర్తించి నిరంతర థెరపీ అందిస్తే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలతో ఎక్కువ సమయం గడపాలని, స్క్రీన్ టైమ్ తగ్గించి బయట ఆటలు ప్రోత్సహించాలని సూచించారు. మెడికల్ సూపరింటెండెంట్ డా. మనోహర్ మాట్లాడుతూ ఆటిజం ఒక వ్యాధి కాదని,ఇది పిల్లల అభివృద్ధి సంబంధిత పరిస్థితి అని తెలిపారు. ప్రారంభ దశలో గుర్తించి సరైన శిక్షణ, థెరపీ అందిస్తే సాధారణ జీవితానికి దగ్గర చేయవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు. పిల్లలతో రోజూ కొంత సమయం గడపాలని, మొబైల్, టీవీ వినియోగం తగ్గించాలని,బయట ఆటలు ప్రోత్సహించాలని,సమస్యలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆయన సూచించారు. నిరంతర థెరపీ ద్వారా మంచి అభివృద్ధి సాధ్యమని తెలిపారు.

## ఆశ్రమ వార్షికోత్సవం



**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శుక బ్రహ్మ ఆశ్రమం 76వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి పేరిట కొనసాగుతున్న కళాశాలలో ప్రథమ స్థానం వచ్చిన విద్యార్థినీ స్రవంతికి ప్రోత్సాహక నగదు బహుమతి పీఠాధిపతి శ్రీ విద్యా స్వరూపానంద స్వామి అందించి ఆశీర్వదించారు. భజగోవిందం గ్రంథాన్ని ఆవిష్కరించారు. కర్మ ఫల అనుసారం జన్మలు లభిస్తాయని రాగద్వేషాలకతీతంగా ఆధ్యాత్మిక చింతనతో సనాతన ధర్మాన్ని పాటించాలని ఆశ్రమ పీఠాధిప తులు శ్రీ విద్యా స్వరూపానందగిరి స్వామి పిలుపునిచ్చారు.



## ఆంధ్రుల ఆకాంక్షను ఎన్డీఏ నెరవేర్చింది

### - ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

**తిరుపతి,ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్ర శాశ్వత రాజధానిగా అమరావతిని పార్లమెంట్ ఆమోదించడం సంతోషకరమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఐదు కోట్ల మంది తెలుగు వారి ఆక్షంక్షను నెరవేరుస్తూ రాజ్యసభ అమరావతి చట్టసవరణ బిల్లుకు ఆమోదం తెలపడంతో స్థానిక కృష్ణాపురం ఠాణా వద్ద ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఎన్డీఏ కూటమి నాయకులతో కలిసి పంచముఖ ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించి కేక్ కట్ చేసి టపాకాయలు కాల్చి సంబరాలు చేశారు. ఆంధ్రుల చిరకాల ఆకాంక్ష గురువారంతో నెరవేరిందని,రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో పార్లమెంట్ ఆమోదం ద్వారా లభించిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అమరావతి రైతులు, మహిళలు చేసిన పోరాటానికి జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అండగా నిలబడటమే కాకుండా చట్టబద్ధత సాధనలోనూ కీలకంగా వ్యవహరించారన్నారు. అనుభవశాలి అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో అమరావతి వచ్చే పదేళ్లలో సింగపూర్ లా అభివృధి చెంది తీరుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అమరావతితోపాటు రాష్ట్ర జీవనాడి అయిన పోలవరాన్ని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పూర్తి చేసి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుందని తెలిపారు. గత ఐదేళ్లలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మూడు రాజధానుల పేరిట డ్రామాలు ఆడారని, జగన్ పాలనలో రాష్ట్రం ఇరవై ఏళ్ళు వెనక్కు పోయిందని ఆయన విమర్శించారు. కొత్తగా మావిగన్ పేరుతో జగన్ ఆడుతున్న నాటకాన్ని ప్రజలు చీత్కరిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, యువనాయకులు లోకేష్ ల ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధిలో పోటీ పడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఇంచార్జీ, గ్రీన్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్ పర్సన్ సుగుణమ్మ, రాష్ట్ర హస్తకళ నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, బిజెపి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, టీడీపీ క్లస్టర్ ఇంచార్జీలు జెబి శ్రీనివాస్, దంపూరి భాస్కర్, బిజి కృష్ణ యాదవ్ , బుల్లెట్ రమణ, మునిశేఖర్ రాయల్ , రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రమణ్యం, పాటకం వెంకటేష్, కందాటి సురేష్ రెడ్డి, జనసేన నగర అధ్యక్షులు రాజా రెడ్డి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్లు వరప్రసాద్, తోట వాసు, ఎస్ కే బాబు, పొన్నాల చంద్ర, దూది కుమారి, దూది శివ, క్రికెట్ విజయ్, చింతంశెట్టి మధు, కీర్తన, అన్నా అనిత,శిరీషా, కొండా రాజమోహన్, ప్రభాకర్ రెడ్డి,రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఆటిజం దినోత్సవం



**తిరుపతి,ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి భవాని నగర్ సర్కిల్ నందు అమైరా ఇన్స్టిట్యూట్ ఫర్ స్పెషల్ నీడ్స్ చిల్డ్రన్ మరియు బట్టర్ ఫ్లై చిల్డ్ డెవలప్మెంట్ సెంటర్ ప్రతినిధులు డా. పవన్, డా. అనూష ఆధ్వర్యంలో ప్రపంచ అటిజం దినోత్సవం సందర్భంగా వాక్‌థాన్ ర్యాలీని భవాని నగర్ సర్కిల్ నుండి ప్రకాశం మున్సిపల్ పార్క్ వరకు నిర్వహించారు. మునిసిపల్ పార్క్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగరపాలక సంస్థ మాజీ మేయర్ డాక్టర్ శిరీష, రుయా సూపర్డెంట్ డాక్టర్ మనోహర్ లు విచ్చేశారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ శిరీష గారు మాట్లాడుతూ ప్రపంచ అటిజం దినం సందర్భంగా వాక్ థాన్ నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని మరియు అటిజం సమస్యను పరిష్కరించేందుకు తాము ఉన్నామంటూ ర్యాలీని నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. రుయా హాస్పిటల్స్ సూపరెంటెండెంట్ డాక్టర్ మనోహర్ మాట్లాడుతూ జన్యుపరమైన లోపాలతో వచ్చే అటిజం రుగ్మత ను చిన్న తనంలోనే గుర్తించి సరైన చికిత్సలు అందించి సమస్యను నివారించవచ్చునని తెలిపారు. అమైరా హాస్పిటల్స్ ప్రతినిధులు డాక్టర్ పవన్, డాక్టర్ అనూష మాట్లాడుతూ ప్రపంచ అటిజం దినోత్సవం పురస్కరించుకొని వాక్ థాన్ ర్యాలీ నిర్వహించడం వల్ల ప్రజలలో చైతన్యం కలిగించడం కోసం చేసిన చిరు ప్రయత్నం అని తెలిపారు. అతిజం సమస్యను త్వరితగతిన గుర్తించి చికిత్సలు అందజేసి సమస్య జఠిలం కాకుండా నయం చేయవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ చైర్మన్ ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, ప్రకాశం మునిసిపల్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గోపీనాథ్, కార్యదర్శి చంద్రకాంత్, కోశాధికారి గురునాథం, సోనీ వెంకటేశ్వర్లు, రోటరీ క్లబ్ ప్రతినిధులు లు రాజేంద్ర శెట్టి, సోము రవికుమార్, హేమచంద్ర, మట్టా పురుషోత్తం, జయరాం ప్రసాద్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ రెడ్డప్ప, జెసిఐ ప్రతినిధి తనుషా, యంగ్ ఇండియా ప్రతినిధి గౌరీ తదితరులు పాల్గొన్నారు.

## ఆస్థి పన్ను వడ్డీపై 50 శాతం రాయితి ఏప్రిల్ 30 వరకు పొడిగింపు

### -కమిషనర్ ఎన్.మౌర్య

**తిరుపతి,ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని ఇంటి యజమానులు బకాయి ఉన్న ఆస్థి పన్నులను, ఖాళీ జాగా పన్నులు ఒకేసారి చెల్లించి వడ్డీ లో 50శాతం రాయితీ పొందే అవకాశాన్ని ఏప్రిల్ 30 వరకు పొడిగించామని కమిషనర్ ఎన్.మౌర్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బకాయి ఉన్న యజమానులు నగరపాలక సంస్థకు చెల్లించవలసిన ఇంటిపన్నులు, ఖాళీ జాగా పన్నుల బకాయిలు ఏప్రిల్ 30వ తేదీ లోపు ఏక మొత్తంగా ఒకే సారి చెల్లిస్తే వాటిపై విధించబడిన వడ్డీ లో 50 శాతం మినహాయింపును పొందవచ్చునని తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని గృహ యజమానులు/ ఆస్తిపన్ను చెల్లింపుదారులు ప్రభుత్వం కల్పించిన ఈ సదవకాశం వినియోగించుకుని నగరపాలక సంస్థకు చెల్లించవలసిన ఇంటిపన్నులు, ఖాళీ జాగా పన్నుల బకాయిలు వెంటనే చెల్లించి, 50 శాతం వడ్డీ రాయితీని పొందాలని విజ్ఞప్తి చేశారు. ఈ అవకాశం ఏప్రిల్ 30వ తేదీ వరకు మాత్రమే ఉంటుందని, 2025-26 వరకు ఆస్తిపన్ను, ఖాళీ జాగా పన్నులు సకాలంలో చెల్లించి నగర అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కమిషనర్ ఎన్.మౌర్య ఆ ప్రకటనలో ప్రజలను కోరారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027